నవతెలంగాణ

మెదక్

1

బుధవారం | 29 మే 2024 | www.navatelangana.com

ప్రజల పక్షాన నిలిచిన కవి సురవరం



నవ తెలంగాణ - సిద్దిపేట

తెలంగాణ భాష, సంస్కృతి వికాసానికి కృషి చేసిన మహనీయులు సురవరం ప్రతాపరెడ్డి అని జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు ఎన్నవెల్లి రాజమౌళి అన్నారు. తెలంగాణ వైతాళికులు సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రిక సంపాదకులుగా, రచయితగా, ఉద్యమకారులుగా, బహుముఖంగా ప్రజల పక్షాన నిలిచిన మహనీయుడు సురవరం ప్రతాపరెడ్డి అని అన్నారు. బాల సాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం మాట్లాడుతూ 354 మంది తెలంగాణ కవుల పరిచయంతో గోలకొండ కవితా సంచిక ప్రచురించి చరిత్రలో నిలిచిపోయిన సురవరం ఆదర్శప్రాయులన్నారు. బహుభాషలో పట్టున్న సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ సాహిత్యానికి ఎనలేని కీర్తి తెచ్చి పెట్టాడన్నారు. ఈ కార్యక్రమంలో కవులు వరుకోలు లక్ష్మయ్య, బస్వ రాజ్ కుమార్, కోణం పర్శరాములు, మిట్టపల్లి పరశు రాములు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారుల సోదాలు

నవ తెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని రవాణా శాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. సంగారెడ్డికి చెందిన అధికారులు సోదాలు నిర్వహించినట్లు సమాచారం. రవాణా శాఖ కార్యాలయంలో ముఖ్యమైన ఫైల్స్‌ను, కంప్యూటర్‌లో పొందుపరచిన సమాచారంను పరిశీలించినట్లు తెలుస్తుంది. సుమారు 15 మంది వరకు ఏసీబీ అధికారులు సోదాల్లో పాల్గొన్నట్లు సమాచారం.



అంతర్ రాష్ట్ర డీజిల్ దొంగల అరెస్టు

310 లీటర్ల డీజిల్, 22 వేల రుపాయల నగదు స్వాధీనం



నవ తెలంగాణ-కొండపాక

రాత్రి సమయంలో పెట్రోల్ బంకుల్లో ఆగి ఉన్న లారీల్లో నుంచి రోడ్డు పక్కన అగి ఉన్న లారీల నుంచి డీజిల్ ట్యాంకులు పగలగొట్టి డీజిల్ దొంగతనం చేస్తున్న నిందితులను మంగళవారం కుకునూర్ పల్లి పోలిసులు చాకచక్యంతో పట్టుకున్నారని గజ్వేల్ ఎసిపి పురుషోత్తం రెడ్డి తెలిపారు. కుకునూర్ పల్లి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల జనవరి 15 తేది నాడు అంధ్రప్రదేశ్ కి చెందిన గోపి తన లారిని మండలంలోని వెలికట్ట చౌరస్తా వద్ద గల పెట్రోల్ బంక్ వద్ద అపి నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు డీజిల్ ట్యాంక్ పగలగోట్టి అందులోని 300 లీటర్ల దొంగలించుకపోయారని కుకునూర్ పల్లి పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసుకోని ప్రత్యేక టీం ఏర్పాటు చేసి పోరిశోదన ప్రారంభించారు. మంగళవారం 28-05-2024 నాడు మండలంలోని రాజీవ్ రహదారిపై వెలికట్ట చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి నిందితులను పట్టుకొని విచారించగా డిజీల్ దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నారు. నిందితులు అన్వర్ , హనీఫ్ ఖాన్ , రోషన్ జాతవ్, ముఖేష్ వర్మ బీరం సింగ్ వర్మ లని పట్టుకొని విచారించగా వారి వద్ద నుంచి 310 లీటర్ల డీజిల్ , 22 వేల నగదును బోలేరో, డిసిఎంని స్వాధీనం చేసుకోవడం జరిగిందని వారిని జ్యూడిషియల్ రిమాండ్‌కి పంపిస్తామని తెలిపారు. నిందితులలో ఒకరు పరారిలో ఉన్నాడని అతడిని కూడ పట్టుకుంటామని తెలిపారు. వీరిపై జగదేవ్‌పూర్, తూప్రాన్, చౌటుప్పల్, ఇబ్రహీంపట్నం పోలిస్ స్టేషన్‌లలో కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర వహించిన సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తోగుట సిఐ లతీఫ్, కుకునూర్ పల్లి ఎస్ ఐ పి శ్రీనివాస్ , పోలిస్ సిబ్బంది రమేష్, రాజు , క్రైం పార్టీ సిబ్బంది తదితరులు ఉన్నారు

51

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్న టాస్కోఫోర్స్ పోలీసులు



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ట్రాలీ ఆటోలో 30 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని వెంబడించి సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గిరిపల్లి శివారులో ఈ వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పోలీసులు మాట్లాడుతూ ట్రాలీ ఆటోలో ప్రభుత్వ రేషన్ బియ్యం 30 క్వింటాళ్ల అక్రమంగా రవాణా చేస్తున్నారని సమాచారం అందుకున్నామన్నారు. గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గిరిపల్లి, గ్రామ శివారులో మాడోత్ రాజేందర్, బుక్య శ్రీకాంత్, ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇరువురు పుట్టగూడెం గ్రామం రాజుపేట మండలం, భువనగిరి యాదాద్రి జిల్లా వ్యక్తులుగా నిర్ధారణ చేశామన్నారు. వీరు గజ్వేల్ మండలం చుట్టుపక్కల గ్రామాలలో తక్కువ రేటుకు రేషన్ బియ్యం కొనుక్కొని ఎక్కువ రేటుకు అమ్ముదామని వెళ్తున్నారన్నారు. నమ్మదగిన సమాచారం రాగా పోలీస్ అధికారులు, గజ్వేల్ పోలీసులు పట్టుకున్నారన్నారు. అనంతరం గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారన్నారు. పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.గ్రామాలలో,పట్టణాలలో ఇసుక అక్రమ రవాణా చేసిన, పిడిఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టిన రవాణా గ్యాంబ్లింగ్, పేకాట వాడినట్లయితే సమాచారం అందించాలన్నారు. ఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

బ్లాస్టింగులతో భయానందోళనలో కార్మికులు

జాగ్రత్తలు తీసుకోకుండా పట్ట పగలే బ్లాస్టింగులు



నవతెలంగాణ-మర్కుక్

పట్ట పగలే తగు జాగ్రత్తలు తీసుకోకుండా జోడాస్ కంపనీ యాజమాన్యం బ్లాస్టింగ్ చేయడం అపాలని సీజన్స్ బయోలాజికల్స్ కంపనీ, లైఫ్ స్పాన్ కంపనీ ఉద్యోగులు, కార్మికులు కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ జోడాస్ కంపనీ యాజమాన్యం నిర్మాణాల కోసం బ్లాస్టింగ్‌ను విచలవిడిగా చేపడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. లైఫ్ స్పాన్ కంపనీ సెక్యూరిటీ రూం, గేటుకు అతికించిన గ్రానైట్ బ్లాస్టింగ్‌లకు కింద పడిపోయాయి. పక్కనే ఉన్న సీజన్స్ బయోలాజికల్స్ కంపనీకి పెట్టిన గ్లాసెస్ ధ్వంసమయ్యాయి.ఏదేమైనా సంబంధిత అధికారులు, జోడాస్ కంపనీ యాజమాన్యం స్పందించి బ్లాస్టింగ్‌లను అపాలని, సదరు కంపనీ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై జోడాస్ కంపనీ జనరల్ మేనేజర్ ఎస్.బి.క్రిష్ణచారిని 'నవతెలంగాణ' వివరణ కోరాగా ఆ సమయంలో తాను సెలవులో వున్నానని సదరు కాంట్రాక్టరుకు తెలుసని మాట దాట వేశాడు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

నవతెలంగాణ-జహీరాబాద్ : భారత కార్మికోద్యమ చరిత్రలో సీఐటీయూ ఆవిర్భావం ఒక మైలురాయి అని.. కార్మికుల హక్కులు, చట్టాల రక్షణకు సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా ఉద్యమాలు పోరాటాలు నిర్వహిస్తూ ఐక్య ఉద్యమాలు నిర్మిస్తున్న ట్రేడ్ యూనియన్ సీఐటీయూ అని.. ఇంత ఘన చరిత్ర కలిగిన సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం మే 30న ఘనంగా నిర్వహించాలని కార్యకర్తలకు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ పిలుపునిచ్చారు. శ్రామిక్ భవన్‌లో మంగళవారం జరిగిన పిరామిల్ సీఐటీయూ యూనియన్ సమావేశంలో మహిపాల్ మాట్లాడుతూ.. నిత్యం కార్మికుల సమస్యలపై పోరాడుతూ కార్మిక చట్టాల పరిరక్షణ, ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తున్న సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటుందని, ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరపాలన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని పరిశ్రమలు యూనియన్లు అడ్డాల కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో సీఐటీయూ జెండాను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలపై భవిష్యత్తులో సీఐటీయూ మరిన్ని ఉద్యమాలు, పోరాటాలు, ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. సీఐటీయూ కార్యకర్తలు, నాయకులు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు పోరాటాలు నిర్వహించేందుకు ముందు ఉండాలని కోరారు. ఈ సమావేశంలో పిరామిల్ సిఐటియూ ప్రధాన కార్యదర్శి నర్సయ్య, నాయకులు ప్రభు సూర్యకాంత్ బస్వరాజు, సంజీవ్‌రెడ్డి, నిజాం, అజీమ్, బాగన్న పాల్గొన్నారు.



విద్యా శాఖలో... ఇంచార్జీల పాలన



- పాఠశాలల పర్యవేక్షణ గాలికి
- డిప్యూటీ డీఈఓల్లేరు...ఎంఈఓలంతా ఇంచార్జీలే
- ఒక్కొక్కరికి 8 మండలాల బాధ్యతలు
- ఎఫ్ఆర్‌సీ యాప్‌కు సాంకేతిక సమస్యలతో సమయం వృధా
- ఖాళీల్ని భర్తి చేయడమే పరిష్కారం:టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మి మెదక్ జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో ఆశించిన మెరుగుదల కనిపించట్లేదు. పైగా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యా బోధనలో మెరుగైన పద్ధతుల్ని అనుసరించడమే కాకుండా నిరంతర పర్యవేక్షణ అవసరం. తద్వారా ఉన్నత పాఠశాల స్థాయిలో విద్యార్థులు ఉన్నత ప్రమాణాలతో ఉత్తీర్ణత సాధించేందుకు వీలుంటది. సంగారెడ్డి జిల్లాలో 1239 ప్రభుత్వ పాఠశాలలుండగా వీటిల్లో ప్రాథమిక పాఠశాలలు 646, ప్రాథమికోన్నత పాఠశాలలు 199, ఉన్నత పాఠశాలలు 209, ఎయిడెడ్ మరికొన్ని ఇతర పాఠశాలున్నాయి. సిద్దిపేట జిల్లాలో 976 పాఠశాలలుండగా వీటిల్లో 636 ప్రాథమిక, 113 ప్రాథమికోన్నత, 227 ఉన్నత పాఠశాలలున్నాయి. మెదక్ జిల్లాలో 1062 ప్రాఠశాలలున్నాయి. వీటిల్లో 637 ప్రాథమిక, 183 ప్రాథమికోన్నత, 242 ఉన్నత పాఠశాలలున్నాయి. మూడు జిల్లాల్లో కలిపి 3277 ప్రభుత్వ పాఠశాలుండగా వీటిల్లో 24 వేల వరకు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

ఇంచార్జీల పాలనతో పర్యవేక్షణ గాలికి

విద్యా శాఖలో నిరంతర పర్యవేక్షణ చేయాల్సిన కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉండడంతో ఇంచార్జీల పానల కొనసాగుతుంది. కొన్నేళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ ఆగిపోయింది. మండల స్థాయిలో పని చేయాల్సిన మండల విద్యాధికారి (ఎంఈఓ) పోస్టుల భర్తీ కూడా ఆగిపోయింది. రిటైర్‌మెంట్స్ తప్ప నియామకాలు చేయకపోవడంతో ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎంఈఓ పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. సిద్దిపేట జిల్లాల్లో 8 మండలాలకు ఒక ఇంచార్జీ ఎంఈఓ ఉన్నారు. మెదక్‌లో కూడా ఆరేడు మండలాలకు ఒకరు, సంగారెడ్డిలో ఒక్కొక్కరికి ఆరు ఎనిమిది మండలాల బాధ్యతలిచ్చారు. ఆరేడు మండలాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, విద్యా బోధన, అడాకమిక్ క్యాలెండర్ అమలు, మధ్యాహ్న భోజన పథకం, పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ, యూనిట్స్, వార్షిక పరీక్షల నిర్వహణ, ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక తరగతుల నిర్వహణ, పాఠశాలల్లో మంచినీరు, మరుగుదొడ్ల వసతి, ప్రయోగశాలలు, గ్రంథాలయాల నిర్వహణ, క్రీడల ఇలా అనేక విషయాల్ని నిరంతరం పర్యవేక్షించాలి. అందు కోసం మండల స్థాయిలో ఒక విద్యా అధికారి అదే పనిగా విధులు నిర్వహించాలి. కానీ..! రెగ్యులర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఉన్న వాళ్లల్లో సీనియర్ ప్రధానోపాధ్యాయుల్ని ఇంచార్జీ విద్యాధికారులుగా నియమించారు. దీంతో ఆయా పాఠశాలల్ని సక్రమంగా నిర్వహించే బాధ్యతలు చూడాల్సిన హెచ్ఎంలకు ఎంఈఓగా ఇంచార్జీ ఇవ్వడంతో పాఠశాలల పర్యవేక్షణ కోసం మరోకర్ని ఇంచార్జీ హెచ్ఎంలుగా నియమించారు. ఇలా పాఠశాల, మండల, జిల్లా స్థాయిలోనూ పర్యవేక్షణలో ఇంచార్జీలే ఉండడం వల్ల ఏ పని సరిగ్గా చేయలేకపోతున్నారు. పైగా మన ఊరు-మన బడి పనుల్ని సైతం పర్యవేక్షించే పరిస్థితిలేక ఎక్కడా వంద శాతం పనులు పూర్తవ్వలేదు. మధ్యాహ్న భోజన బిల్లులు చేయడం, సమావేశాలకు హాజరుకావడం తప్ప ఇంచార్జీలు మరో పని చేయలేని పరిస్థితి ఉంది.

విద్యా శాఖలో పోస్టులన్నీ ఖాళీలుగా ఉండడంతో పర్యవేక్షణ గాలికొదిలేసినట్టైంది. ఇంచార్జీల పాలన సాగుతోంది. ఒక్కొక్కరికి ఏడెనిమిది మండలాల బాధ్యతలు కట్టబెట్టడంతో ఏ పని సరిగ్గా చేయలేకపోతున్నారు. బిల్లులు, సమావేశాలతోనే సరిపోతుంది. డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఏళ్ల తరబడిగా భర్తీకి నోచుకోకపోవడంతో సీనియర్ హెచ్‌ఎంలను ఇంచార్జీ ఎంఈఓలుగా నియమించి చేతులు దులుపుకున్నారు. ఫలితంగా పాఠశాలల పర్యవేక్షణ లేక విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు సైతం అస్తవ్యస్తంగా మారింది. పైగా పుండు ఒక చోట ఉంటే మందోచోట రాసినట్లుగా పర్యవేక్షించాల్సిన అధికారుల్ని నియమించకుండా ఉపాధ్యాయుల హాజరు కోసం బయోమెట్రిక్, ఎఫ్ఆర్‌సీ పద్ధతులు తెస్తున్నారు. సాంకేతిక సమస్యల వల్ల సమయం వృధా కావడం తప్ప ఫలితంలేదనే చెప్పాలి. డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ పోస్టుల్ని భర్తీ చేయడంతో పాటు పదోన్నతుల ప్రక్రియను చేపట్టడమే శాశ్వత పరిష్కారమని టీఎస్‌యూటీఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి.

ఎఫ్ఆర్‌సీ వల్ల సమయం వృధా

ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పర్యవేక్షించేందుకు రెగ్యులర్ డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలను నియమించకుండా ఉపాధ్యాయుల హాజరు కోసం ఎఫ్ఆర్‌సీ పద్ధతి తీసుకొచ్చారు. బయోమెట్రిక్ పోయి ఉపాధ్యాయుల ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ పద్ధతిని అమలు చేస్తున్నారు. ఇందు కోసం డీఎఫ్‌సీ-ఎఫ్‌ఆర్‌సీ ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. ప్రతి రోజూ ఉపాధ్యాయులు 9.30 గంటలలోగా బడికి వచ్చి సెల్‌పోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న యాప్‌లో ముఖ గుర్తింపు ద్వారా హాజరు నమోదు చేసుకోవాలి. సాయంత్రం స్కూల్ నుంచి వెళ్లిపోయే సమయంలోనూ యాప్‌లోనే హాజరు నమోదు చేయాల్సి ఉంటది. ఇది మంచి పద్దతే అయినప్పటికీ రోజుకు రెండు సార్లు ఎఫ్ఆర్‌సీ హాజరు చేయాల్సి రావడంతో నెట్ సరిగ్గా ఉండక, సిగ్నల్ లేక ఆలస్యమవుతుంది. బిల్డింగ్ పైకెక్కి హాజరు నమోదు చేయాల్సి వస్తుంది. దీన్ని వల్ల మొదటి పీరియడ్ సగం, కొన్ని సార్లు 45 నిమిషాలు వృదా అవుతున్న పరిస్థితి ఉందని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఖాళీల్ని భర్తి చేయాలి: టీఎస్‌యూటీఎఫ్

విద్యా శాఖలో పర్యవేక్షణ పెరగాలంటే డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ పోస్టుల్ని వెంటనే భర్తీ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, సంగారెడ్డి కార్యదర్శి సాయిలు అన్నారు. డిప్యూటీ డీఈఓల వ్యవస్థ ఉన్నప్పుడు డీఈఓ, మరో డిప్యూటీ డీఈఓలు కలిసి జిల్లా అంతటా పర్యవేక్షించేది. ఒక్కో విభాగం పనుల్ని ఒక్కొక్కరు చూసేది. ఆ వ్యవస్థ పోయాక అన్ని పనుల్నీ డీఈఓ ఒక్కరే చూడలేని పరిస్థితి ఉంది. మండల విద్యాధికారి పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల ఇంచార్జీలను పెట్టారు. దీంతో పర్యవేక్షణ అస్తవ్యస్థంగా మారింది. ప్రభుత్వం రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలి. ఎఫ్ఆర్‌సీ మంచిదే అయినప్పటికీ సాంకేతిక సమస్యల వల్ల సమయం వృదా అవుతోంది. పర్యవేక్షణ పెరగాలంటే ఖాళీ పోస్టుల్ని భర్తీ చేయాలి.

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

- లేబర్ కోడ్లను రద్దు చేయాలి
- కార్మిక చట్టాలను యదావిధిగా అమలు చేయాలి
- కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి
- సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం

నవతెలంగాణ-మెదక్

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను యదావిధిగా అమలు చేయాలని గత 9 నెలలుగా పెండింగ్లో ఉన్న గ్రామ పంచాయితీ, హాస్పిటల్ కార్మికుల వేతనాలు, మున్సిపల్ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవన్లో సీపీఎం పార్టీ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు 3వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కార్మికులు గత 100 సంవత్సరాలకు ముందే అనేక ఐక్య పోరాటాలు నిర్వహించి కార్మిక హక్కులను, చట్టాలను సాధించుకున్నారని తెలిపారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయాల్సిన బీజేపీ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను అమలు చేసిందని మండిపడ్డారు. సమాజంలో కార్మికుడు ఉత్పత్తి చేస్తేనే సమాజం మనుగడ కొనసాగుతుందని కార్మికుడి శ్రమ ద్వారానే ఉత్పత్తి సాధ్యమౌతుందని, సమాజం కొనసాగుతుందని చెప్పారు. కార్మికులు సాధించుకున్న హక్కులలో కనీస వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని 44 రకాలుగా ఉన్న చట్టాలను 4 లేబర్ కోడ్లుగా మార్చిందన్నారు. ప్రపంచమంతా కరోనా భయంలో ఉంటే దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మాత్రం కార్మిక చట్టాలను మార్చే పనిలో ఉన్నట్లు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేసిందన్నారు. ప్రభుత్వ పథకాల్లో పని చేసే స్కీమ్ వర్కర్స్ అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, 2వ ఏఎన్ఎంలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఐకేపీ వీఓఏలు వంటి కార్మికులకు గౌరవ వేతనం, పారితోషికాల పేరుతో శ్రమ దోపిడీ చేస్తూ ఎటువంటి చట్టాలు అమలు కాకుండా చేసిందన్నారు. గ్రామ పంచాయితీ కార్మికులు, మున్సిపల్ కార్మికులచే వెట్టి చాకిరి చేయిస్తూ వేతనాలు సకాలంలో చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేయడం ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించే కార్మికులు, పారిశ్రామిక రంగంలో పని చేసే కార్మికులు కనీస వేతనాలు లేక అత్యధిక గంటలు పని చేసి చాలిచాలని జీతాలతో జీవితం గడుపుతున్నారన్నారు. 8 గంటల పని విధానం నుండి 12 గంటలకు పెంచి శ్రమ దోపిడీ చేస్తుందన్నారు. భారతదేశంలో ఉన్న కేరళ రాష్ట్రంలో కనీస వేతనం అమలు అవుతున్నదని తెలిపారు. కార్మిక చట్టాలను అమలు చేస్తున్నదన్నారు. వలస కార్మికుల పేర్లు నమోదు చేసుకొని వారికి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. మరి కేంద్ర బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా కార్మికులకు అండగా ఉండాల్సింది పోయి కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. అంతిమంగా కార్మిక చట్టాలను కాపాడుకోవడం కోసం కార్మికులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని, కార్మికులకు నష్టం కలిగించే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పై పోరాడడానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే నర్సమ్మ, కే.మల్లేశం, ఏ. మహేందర్, జిల్లా కమిటి సభ్యులు నాగరాజు, సంతోష్, బాగయ్యా, నాయకులు నరేందర్, అజయ్, దేవయ్య, సక్కుబాయి, నాగమణి, వసంత, అశోక్, ప్రవీణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



నూతన చట్టాలపై అవగాహన పరిజ్ఞానం పెంచుకోవాలి

- సిద్దిపేట సీపీ. డాక్టర్ బి. అనురాధ

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

జూలై 1 నుంచి అమలయ్యే నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పరిజ్ఞానం పెంచుకోవాలని సిద్దిపేట సీపీ. డాక్టర్ బి. అనురాధ అన్నారు. మంగళవారం సీపీ కార్యాలయంలో నూతన చట్టాలపై పోలీస్ అధికారులకు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారుల వరకు విడతలవారీగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, నూతన చట్టాలపై పోలీసు సిబ్బంది సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని సూచించారు. దేశంలో నేర న్యాయ వ్యవస్థను పూర్తిగా మార్చేందుకు తీసుకోనున్న చర్యలలో భాగంగా, కొత్తగా రూపొందించిన మూడు చట్టాలు అమలులోకి రానున్న నేపథ్యంలో పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై సిబ్బందికి పూర్తి పరిజ్ఞానం ఉండాలన్నారు. రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలి, ఏఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, స్టేషన్ బెయిల్‌కు ఎవరు అర్హులు, చార్జీషీట్ ఎలా తయారు చేయాలి, నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు ఎలా వ్యవహరించాలి తదితర అంశాలపై కొత్త చట్టంలో మార్పులు చేర్పులు చేశారన్నారు. అనంతరం టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ జానకి రామ్ రెడ్డి, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్, ఐటీ సెల్ ఎస్ఐ నరేందర్ రెడ్డి, జగదేవపూర్ ఎస్ఐ చంద్రమోహన్‌లు నూతన చట్టాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ యస్. మల్లారెడ్డి, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, ఎస్ఐ విజయభాస్కర్ పోలీస్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జిల్లాను కల్తీ రహిత విత్తనాల జిల్లాగా తీర్చిదిద్దాలి

రాబోయే 30 రోజులు చాలా కీలకం

జిల్లాను కల్తీ రహిత విత్తనాల జిల్లాగా తీర్చిదిద్దాలని, రాబోయే 30 రోజులు చాలా కీలకమని పోలీసు అధికారులు, అగ్రికల్చర్ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సీపీ. డాక్టర్. అనురాధ అన్నారు. సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారలుతో పాటు పోలీస్ స్టేషన్ల వారీగా ఏర్పాటు స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు సిబ్బందితో సీపీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణాల్లో, ఏజెంట్లు, మధ్యవర్తుల ముసుగులో కల్తీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, నకిలీ విత్తనాల విక్రయాలలో తరచూ కేసులు నమోదైతే పీడీ యాక్ట్ అమలు చేయాలని సూచించారు. అక్రమ రవాణా నియంత్రించేందుకు జిల్లా సరిహద్దులో నిఘా వ్యవస్థ పటిష్టం చేయాలని, నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేయాలని చూస్తే సహించభోమన్నారు. జిల్లాలో ఏ ఒక్క రైతుకు కూడా నకిలీ విత్తనాలతో మోసపోకుండా చూసే బాధ్యత వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ అధికారులదే అని సూచించారు. విత్తనాలు, పురుగుల మందుల గోదాములు ఎక్కడెక్కడ ఉన్నాయో పూర్తి అవగాహన ఉండాలని, గోదాములపై నిఘా ఉంచాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ యస్. మల్లారెడ్డి, టాస్క్ ఫోర్స్ అధికారులు, స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు, సిబ్బంది ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

బేగరి నర్సింలు హత్యపై సమగ్ర విచారణ జరపాలి

- 18 న దాడి జరిగితే నింధుతుల్ని పట్టుకోని పోలీసులు
- కుల దురంకారి పట్లోళ్ల దయానంద్, మరో 8 మందిని అరెస్టు చేయాలి
- నర్సింలు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదోకోవాలి
- నిర్లక్షం వహిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలి
- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ డిమాండ్
- బాధిత కుటుంబానికి కేవీపీఎస్ బందం పరామర్శ

నవతెలంగాణ-కోహీర్

సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలం బడంపేట్ గ్రామంలో ఈ నెల 26న గ్రామంలోని అగ్రకుల పెత్తందార్లు దాడికి పాల్పడిన సంఘటనలో మరణించిన బేగరి నర్సింలు హత్యపై సమగ్ర విచారణ జరపాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. మంగళవారం కేవీపీఎస్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి బృందం బడంపేట గ్రామాన్ని సందర్శించింది. బాధిత కుటుంబ సభ్యుల్ని కలిసి ఓదార్చి హత్య జరిగిన సంఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆత్మస్థైర్యంక కోల్పోకుండా ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ మాట్లాడుతూ ఈ నెల 18న గ్రామ పెత్తందార్లు కలిసి మూకుమ్మడిగా బేగరి నర్సింలుపై పాల్పడ్డారని పేర్కొన్నారు. తీవ్ర గాయలపాలై హైదరాబాద్ ఉస్మానియాలో చికత్స పొంది చనిపోయిన బేగరి నర్సిములు కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేసే వరకు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం పోరాడుతుందన్నారు. బేగరి నర్సింహులు కుమారుడు ఈ నెల ఒకటవ తేదీన వేరే గ్రామానికి చెందిన ఒక అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడని తెలిపారు. అతనిపై పోక్సో కేసు నమోదు చేయడం వల్ల ప్రస్తుతం జైల్లో ఉన్నాడని పేర్కొన్నారు. అగ్రకులపు అమ్మాయిని పెళ్లి చేసుకున్న దళితుడైన బేగరి నర్సింహులపై అదే గ్రామానికి చెందిన అగ్రకులస్తులు తక్కువ కులమైన మీరు మాకు సంబంధించిన అమ్మాయిలని తీసుకెళ్తారా అంటూ తిట్టి కొట్టి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల క్రితం గ్రామంలో అంబేద్కర్ జెండాను ఏర్పాటు చేసే క్రమంలో కూడా నర్సింలు పై గ్రామస్తులు దాడి చేసి పోలీస్ స్టేషన్‌కు అప్పగించడం జరిగిందన్నారు. ఇవన్నీ దష్టిలో ఉంచుకున్న అగ్రకులానికి చెందిన వ్యక్తులు ఈ నెల 18న రాత్రి సమయంలో ఇష్టానుసారంగా కొట్టి ఊరి చివరకు తీసుకెళ్లి కొట్టి పడేశారన్నారు. రక్తపు మడుగులో పడి ఉన్న నర్సిములును కుటుంబ సభ్యులు చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడరన్నారు. ఈ నెల 18 నర్సింహులుపై దాడి జరిగిందని అతని తండ్రి బేగరి రచయ్య పిర్యాదు చేసినా పోలీసులు నిందితులపై ఏలాంటి చేర్యలు తీసుకోక పోవటంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. బాధితులు పిర్యాదులో పేర్కొన్న 9 మందిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నర్సిములు హత్య పై సమగ్ర విచారణ జరిపేందుకు ఉన్నతాధికారిని నియమించాలన్నారు. మతుని కుటుంబనికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితుడైన నర్సింహులుకు సొంత ఇల్లు కూడా లేనందున ఇందిరమ్మ ఇల్లు, 3ఎకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నింధితుల్ని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా కేవీపీఎస్ ఆందోళనలు చేపడుతుందన్నారు. మతుని కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పి. అశోక్, జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, నాయకులు నరేష్, తుల్జారం శ్రీనివాస్, నాగేందర్, జైపాల్ గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రమాదవశాత్తు గోడ కూలి మహిళ మృతి

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

ప్రమాదవశాత్తు గోడ కూలి మహిళా మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. హవేలీ ఘనపూర్ ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముత్తాయి పల్లి గ్రామానికి చెందిన ఎరుకల సువర్ణ (35) మృతి చెందింది. ముత్తాయి పల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి నిర్మాణ పనుల కోసం వెళ్ళింది. మృతురాలి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు.



నవతెలంగాణ

సంగారెడ్డి

2

బుధవారం | 29 మే 2024 | www.navatelangana.com

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలి



నవతెలంగాణ-న్యాల్‌కల్

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ సెక్రెటరీలు చూసుకోవాలని మిషన్ భగీరథ డిఈ సాబేర్ హుస్సేన్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అవగాహనా సమావేశంలో డీఈ మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలం దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో నీటి ట్యాంకుల్లో క్లోరిఫైడ్ బ్లీచింగ్ పౌడర్ వేసి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీడీవో సురేష్, పంచాయతీ సెక్రెటరీలు రవీందర్, నాగభూషణం, సంతోష్ , చరణ్, ఉన్నారు.

రంగనాథ స్వామి కళ్యాణోత్సవంలో మంత్రి



నవతెలంగాణ-జోగిపేట

ఆందోల్‌లోని శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన కళ్యాణోత్సవంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ, కూతురు త్రిష, అల్లుడు మణికంఠలు ప్రత్యేక అతిథులుగా హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్యామ్నాథ్, వేద పండితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కళ్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జోగిపేట పాత గోశాలలో అగ్నిప్రమాదం

లక్ష వరకు ఆస్తి నష్టం



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట పట్టణంలోని పాత గోశాలలో మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా అగ్నిప్రమాదం జరిగింది. గోశాలకు సంబంధించిన ఎండు పశు గ్రాసానికి నిప్పు అంటుకోవడంతో మొత్తం అగ్నికి ఆహుతై బూడిదయింది. జోగుపేట ఫైర్ అధికారులకు సమాచారం అందించడంతో మధ్యహ్నం నుంచి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. సుమారుగా లక్ష వరకు ఆస్తి నష్టం జరిగినట్లు నిర్వాహకులు సుభాష్ తెలిపారు. ప్రభుత్వం పరంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తెల్లపూర్‌లో 14 వీధికుక్కల తరలింపు



నవతెలంగాణ-రామచంద్రాపురం

తెల్లాపూర్‌లో వీధి కుక్కల కారణంగా 18 మంది గాయాల పాలు అవడంతో అధికారులు కుక్కలను అదుపులోకి తీసుకోవడానికి మంగళవారం చర్యలు చేపట్టారు. డాగ్ క్యాచర్ స్పెషల్ టీం మంగళవారం తెల్లాపూర్ లోని వీధులలో తిరిగి 14 కుక్కలను అదుపులోకి తీసుకొని వాహనాల్లో తరలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని కమిషనర్ సంగారెడ్డి తెలిపారు.

బైక్ అదుపు తప్పి లోయలో పడడంతో వ్యక్తి మృతి



నవతెలంగాణ-పుల్కల్

బైక్ అదుపు తప్పి లోయలో పడడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన చౌటకూరు మండల పరిధిలోని శివంపేట మూలమలుపు వద్ద జరిగింది. పుల్కల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కోడూరు గ్రామానికి చెందిన మంగలి వీరేశం(45) వృత్తిరీత్యా వ్యవసాయం చేస్తుండేవాడు. సొంత పని నిమిత్తం ముత్తంగి గ్రామానికి వెళ్లిన అతడు.. మంగళవారం తిరిగి సొంత గ్రామానికి బైక్‌పై బయల్దేరాడు. చౌటకూరు మండల పరిధిలోని శివంపేట మూలమలుపు వద్ద రాగానే.. బైకు అదుపుతప్పి పక్కనున్న లోయలో పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో అధికారుల తనిఖీలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

చాల్కి, న్యాల్‌కల్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో హద్నూర్ ఎస్సై రాము నాయుడు, మండల ఏవో లావణ్య మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు తప్పకుండా పాటించాలని ఫర్టిలైజర్ డీలర్లకు సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్ ఉండాలన్నారు. అలాగే రైతులు కూడా లైసెన్సు కలిగిన ఫర్టిలైజర్ డీలర్ల వద్ద కొనుగోలు చేయాలని.. రసీదు తప్పకుండా తీసుకోవాలని సూచించారు.

పచ్చిరొట్టె విత్తనాల కోసం బారులు తీరిన రైతులు



నవతెలంగాణ-పుల్కల్

మండల కేంద్రంలోని ఆగ్రోస్ ఫర్టిలైజర్ షాపుల్లో మంగళవారం పచ్చి రొట్టె విత్తనాలను విక్రయించారు. అయితే విత్తనాలు కోసం ఉదయం 7 గంటల నుంచి దుకాణాల ఎదుట రైతులు బారులు తీరారు. ఉదయం 9 అయినా షాపులు తెరవకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో రెండు ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాలు ఉన్నప్పటికీ.. మండల వ్యవసాయ అధికారి నిర్లక్ష్యం వల్ల రైతులకు తిప్పలు తప్పలేదు. తిండి, దూప లేకుండా భగభగ మండే ఎండను సైతం లెక్కచేయకుండా విత్తనాల కోసం గంటల కొద్ది లైన్లల్లో రైతులు నిల్చున్నారు. రైతులు 7 గంటలకు వస్తే.. విత్తనాలను మాత్రం 11 గంటలకు విక్రయించారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సరిపడే పచ్చి రొట్టె విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఆయా గ్రామాల రైతులు కోరారు. లేనియెడల మండల కేంద్రంలో ఉన్న ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాల ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

విత్తనాలు కొన్నప్పుడే రసీదు తప్పక తీసుకోవాలి



నవతెలంగాణ-మనూర్

రైతులు విత్తనాలు కొన్నప్పుడు వాటికి సంబధించిన రసీదును తప్పకుండా తీసుకోవాలని పుల్కుర్తి క్లస్టర్ వ్యవసాయ అధికారి బి మహేష్ సూచించారు. మండలంలోని దోసపల్లిలో విత్తనాలు, ఎరువుల కొనుగోలు అప్పు డు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు మంగళవారం అవగాహనా సదస్సు నిర్వ హించారు. లైసెన్స్‌డ్ దుకాణాల్లో మాత్రం విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. భూమిలో ఎక్కువ తేమ ఉంటేనే విత్తనాలు వేసుకోవాలని సూచిం చారు. అదే విధంగా వ్యవసాయ అధికారులు సంగమేశ్వర్, ప్రవీణ్ కుమార్, సాయి చరణ్‌రెడ్డిలు ఆయా గ్రామాల్లో రైతులకు అవగాహనా కల్పించారు.

విత్తన విక్రయాలపై రసీదులు తప్పనిసరి



నవతెలంగాణ-ఝరాసంగం

లైసెన్స్‌డ్ ఫర్టిలైజర్ దుకాణాల్లోనే రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని.. అంతేకాకుండా అందుకు సంబంధించి రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ అన్నారు. మండల పరిధిలోని బిడెకన్న, మేదపల్లి, చీలేపల్లి, ఎల్గోయి, గంగాపూర్, గుంతమర్పల్లి గ్రామాల్లో విత్తనాల కొనుగోళ్ల పై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తన ప్యాకెట్ బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధికృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు, లూజ్ విత్తనాలు అమ్మినచో వ్యవసాయ శాఖ అధికారులకు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సుకుమార్ హరికృష్ణ, వినోద్ కుమార్, సంపత్, రేణుక, శివప్రియ, జ్ఞానం,రైతులు సంగమేశ్, జైపాల్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-అమీన్‌పూర్

ఎన్టీఆర్ 101వ జయంతి వేడుకలను అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడా మండే మార్కెట్ లో మున్సిపల్ కౌన్సిలర్ ఎడ్ల రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వ విఖ్యాత, నట సార్వభౌమ నందమూరి తారకరామారావు అని.. ఆయన నటనలో కానీ, రాజకీయంగా కానీ ఎదురులేని శక్తిగా నిలిచాడన్నారు. భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించనట్టుగానే.. త్వరలోనే ఎన్టీఆర్‌కి కూడా భారతరత్న ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మున్సిపాల్టీ ఎన్టీఆర్ అభిమానులు, పలువురు నాయకులు, ఎడ్ల రమేష్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలులో ఇష్టారాజ్యం

- కల్లాల వద్దనే రైతుల పడిగాపులు
- మ్యాచర్ పేరుతో తప్పని తిప్పలు, వేధిస్తున్న లారీల కొరత



నవతెలంగాణ-వట్‌పల్లి

వడ్ల కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకుల ఇష్టారాజ్యం వల్ల సన్న, చిన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పలుకుబడి ఉన్న వారి వడ్లనే ముందుగా కొనుగోలు చేస్తుండడంతో.. చిన్న రైతులు రోజుల తరబడి కేంద్రాల్లోనే ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. మరోపక్క అకాల వర్షాలకు నిల్వ ఉన్న ధాన్యం తడిసిపోతున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వట్‌పల్లి మండలంలోని కాధీరాబాద్, బిజిలిపూర్, కేరూరు గ్రామాల్లో వ్యవసాయ పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఈనెల10న ప్రారంభించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ కొనుగోలు కేంద్రాల్లో అధికారులు, నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. పలుకుబడి కలిగిన వ్యక్తుల వడ్లనే ముందుగా కొనుగోలు చేస్తున్నారని పలువరు ఆరోపిస్తున్నారు. దాంతో చిన్నా, సన్నకారు రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఖాదీ రాబాద్ సెంటర్లో ఇప్పటివరకు 11800 బ్యాగులు అంటే 4,595 క్వింటాళ్ల ధాన్యాన్ని 148 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. అయితే టోకెన్ల ద్వారా వడ్ల కొనుగోలు చేపట్టాలని ఆదేశాలు ఉన్నప్పటికీ.. సెంటర్లలో మాత్రం అవేమీ పట్టించుకోవడం లేదని రైతుల మండిపడుతున్నారు.వడ్లు కొనసాలని పీఏసీఎస్ అధికారుల కార్యాలయం చుట్టూ తిరుగుతూ కాళ్లావేళ్లా పడిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలకు కండ్ల ముందే వడ్లు తడిసి ముద్దవుతున్నాయని కన్నీటిపర్యంతమవుతున్నారు. మొగులయ్య అనే రైతు ఈనెల 8న వరి పంటను కోసి ధాన్యాన్ని ఎండబెడుతున్నా.. ఇప్పటికీ మ్యాచర్ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని సదరు రైతు వాపోతున్నాడు.

వ్యవసాయ విస్తీర్ణ అధికారి మాట్లాడుతూ.. టోకెన్ అందజేసి కొనుగోలు చేయాలనే చెబుతున్నట్టు తెలిపారు. పీఏసీఎస్ సెక్రెటరీ మాట్లాడుతూ.. టోకెన్లు రైతులకు ఇవ్వడం లేదని రైతులందరివి కొనుగోలు చేస్తున్నామన్నారు.



101 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-వట్‌పల్లి

అక్రమంగా తరలిస్తున్న 101 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. టీఎస్ 12యూడీ 0760 అనే డీసీఎం వ్యానులో 101 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని జహీరాబాద్ నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా.. వట్‌పల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీల్లో పోలీసులకు పట్టుబడింది. వెంటనే ఆ డీసీఎంను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్, టాస్కఫోర్స్ టీం సివిల్ సప్లై అధికారులకు పోలీసులు సమాచారం అందజేశారు. అయితే ఆదివారం రాత్రి 10 గంటలకు డీసీఎం వ్యాన్‌ను పోలీసులు పట్టుకుంటే.. ఆ బియ్యాన్ని పరిశీలించేందుకు అధికారులు సోమవారం సాయంత్రం నాలుగు గంటల తర్వాత పీఎస్‌కు చేరుకోవడం చర్చనీయాంశంగా మారింది. సివిల్ సప్లయి అధికారుల ఫిర్యాదు మేరకు డీసీఎం వ్యాన్ యజమాని, డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సంపత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సుందర్ రాజ్ ప్రతాప్ సిబ్బంది ఉన్నారు.

త్వరితగతిన ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి



నవతెలంగాణ-కల్హేర్

త్వరితగతిన ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి అన్నారు. మండలంలోని కృష్ణాపూర్, కల్హేర్, బిబిపేట గ్రామాల్లో కొనసాగుతున్న జొన్నల కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత మేరకు ధాన్యాన్ని తూకం వేసి కొనుగోలు చేశారని అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా లారీల సమస్య గాని బార్దాని సమస్య గాని లేకుండా చూడాలన్నారు. సకాలంలో లోడు తీసుకొని వెళ్లిన లారీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు ఏ సెంటర్లో ఎన్ని బస్తాలు కొనుగోలు చేశారని అడిగి తెలుసుకున్నారు. అందులో కృష్ణాపూర్‌లో 7000 బస్తాలు, బిబిపేటలో 16000 బస్తాలు కొనుగోలు చేస్తే.. ఇప్పటివరకు ఎనిమిది వేల బస్తాలు మాత్రమే లారీ లోడ్‌లో వెళ్లాయని.. ఇంకా ఎనిమిది వేల బస్తాల ధాన్యం మిగిలి ఉందని అధికారులు తెలిపారు. ఈ నెల చివరితో జొన్నల కొనుగోలు ముగుస్తుందని ప్రభుత్వం ప్రకటించడంతో.. ఇంకా కొనాల్సిన ధాన్యం మిగిలిపోతాదేమో అని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ధాన్యం మిగిలిపోతే ఎంతో నష్టపోతామని.. పూర్తి ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కలెక్టర్ కారుకు అడ్డుగా రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. తప్పకుండా మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో రైతుల శాంతించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ బియ్యం శ్రీదేవి, ఏడిఏ నూతన్ కుమార్, ఏఈఓలు, రైతులు తదితరులు, పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో సంగారెడ్డి విద్యార్థులకు గోల్డ్ మెడల్స్



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణానికి చెందిన ఆరు మంది క్రీడాకారులు కిక్ బాక్సింగ్ జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించినట్టు కిక్ బాక్సింగ్ స్టేట్ జాయింట్ సెక్రెటరీ, సంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ పోచయ్య తెలిపారు. ఈనెల 22 నుంచి 26 వరకు మహారాష్ట్ర, పూణే పట్టణంలో నిర్వహించిన జాతీయ స్థాయి చిల్డ్రన్, క్యాడేట్ నేషనల్ లెవెల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ 2024 పోటీల్లో అండర్ 10 విభాగంలో విశ్వేశ్వర్, సాహితీ శిఖరశ్రీ రాథోడ్, భవజ్ఞలు పాలొన్నారు. అండర్ 13 విభాగంలో శిఖర్ దీప్, రఘువంషి, అమోఘ్‌లు పాల్గొన్నారు. రఘు వంషి, శికర్ దీప్, భవజ్ఞ గోల్డ్ మెడల్స్, విశ్వేశ్వర్, అమోఘ్, సాహితీశిఖర శ్రీ రాథోడ్ గ్రౌండ్స్ మెడల్స్ సాధించారు. ఈ పోటీల్లో దేశంలోని 27 రాష్ట్రాల కిక్ బాక్సింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. కిక్ బాక్సింగ్ నేషనల్ ప్రెసిడెంట్ సంతోష్‌అగర్వాల్ అధ్యక్షతన, మహారాష్ట్ర కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. చిన్న వయసులోనే జాతీయస్థాయి కిక్ బాక్సింగ్‌లో రాణించడం, పథకాలు సాధించడం హర్శించదగ్గ విషయమని కిక్ బాక్సింగ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు క్రీడాకారులను ప్రశంసించారు. కోచ్‌లు వర్షిత, మహేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

యథావిధిగా పల్లె ప్రగతి పనులు జరగాలి



నవతెలంగాణ-కల్హేర్

గ్రామాల్లో పల్లె ప్రగతి పనులు యథావిధిగా కొనసాగించాలని జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి సాయి బాబా అన్నారు. కల్హేర్, నిజాంపేట్ మండలాలలోని మునిగేపల్లి, మాదేపల్లి, దేవునిపల్లి, మాసన్‌పల్లితో పాటు వివిధ గ్రామాలలో మంగళవారం పర్యటించారు. పల్లె ప్రగతి పనులను పరిశీలించి గ్రామ అధికారులతో మాట్లాడారు. ఇంతకుముందు పల్లె ప్రగతి పనులు జరిగాయో అదే విధంగా కొనసాగించాలన్నారు. చెత్త సేకరణ, కాలువలను శుద్ధపరచడం, ఎక్కడెక్కడ అయితే గ్యాపులు ఉన్నయో అక్కడ చెట్లు నాటడం, స్మశాన వాటికలో మొక్కలు నాటడం, మృత దేహాలను స్మశాన వాటికలోనే కాల్చే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పల్లె ప్రకృతి వనాలను చెట్లను ఖాళీ స్థలం ఎక్కడ ఉన్నా పూర్తిస్థాయిలో మొక్కలు నాటాలన్నారు. క్రీడా మైదానాలను గ్రామాల్లో విద్యార్థులు వినియోగించుకున్న విధంగా చూడాలన్నారు. గ్రామాల్ల ప్రభుత్వ భూములలో చేపట్టిన డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనాలు, స్మశానవాటికలు, పీడమైదానాలు, వంటి వాటిని ప్రైవేటు వ్యక్తులు కబ్జాలు పెట్టకుండా గతంలో జరిగిన విధంగా అదే విధంగా పల్లె ప్రగతి పనులు కార్యక్రమాలు జరగాలని గ్రామ అధికారులకు సూచించారు. ఆయన వెంట డిఎల్‌పిఓ సుందర్ రావు, ఎంపీఓ శ్రీనివాస్, గ్రామ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన ఏడీ



నవతెలంగాణ-మునిపల్లి

మండల పరిధిలోని పెద్దచెల్మెడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏడీ సత్యనారాయణ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జొన్నల కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు ఎలా జరుగుతున్నాయి.. ఏరోజుకారోజు జొన్నలను తరలిస్తున్నారా అంటూ అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులు కేంద్రానికి తీసుకవచ్చే ధాన్యం విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రైతులు నాణ్యత కూడిన ధాన్యాన్ని తీసుకురావాలని రైతులకు సూచించారు. ఈ కొనుగోలు కేంద్రం ఈనెల 30వ తేదీ వరకు ఉంటుందని, అప్పటిలోగా ఎవరైనా రైతులు తమ వద్ద ఉన్న జొన్నలను సమీప కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు పొందాలన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి జొన్నల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒకవైపు రైతులు ఈ జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఇంకొన్ని రోజుల సమయం పెంచితే బాగుండేది అని కోరుతున్నారు. ఆయన వెంట ఏవో శివకుమార్, ఏఈఓ రహమాన్, పీఏసీఎస్ సొసైటీ కార్యదర్శి శివకుమార్ తదితరులు ఉన్నారు

31న జిన్నారం మండల సభ

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 31న స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ దమ్మగౌని రవీందర్ గౌడ్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు జిన్నారం ఎంపీడీవో అరుణ రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ది నెక్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్స్‌తో గీతం భాగస్వామ్యం



నవతెలంగాణ-పటాన్‌చెరు

అనువర్తిత అభ్యాసంపై దృష్టి సారించి, విభిన్న కోర్సులను బోధించే ప్రఖ్యాత గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, సంపూర్ణ విద్యను అందించడానికి అంకితమైన ప్రతిష్టాత్మక పాఠశాలల నెట్ వర్క్ ది నెక్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. గీతమ్‌లో నిర్వహిస్తున్న ఉన్నత విద్యకు అనుగుణంగా నెక్స్ జెన్ స్కూళ్లలో మాధ్యమిక విద్యను పూర్తిచేసుకునే విద్యార్థులకు మార్పును సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ సహకారాన్ని ఏర్పాటు చేసుకున్నట్టు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఈ భాగస్వామ్యం గురించి గీతం ఉపకులపతి ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం తన హర్షాన్ని వెలిబుచ్చుతూ.. నెక్స్ జెన్ విద్యార్థుల విద్య, వృత్తి పర భవిష్యత్తుకు ఈ సహకారం ఒక ముఖ్యమైన పెట్టుబడిగా అభివర్ణించినట్టు తెలిపారు. క్లిష్టమైన ఆలోచనా విధానంతో యువ మనస్సులను ప్రపంచ సవాళ్లను ధీటుగా ఎదుర్కోవడంతో పాటు. పలు ఆవిష్కరణలు చేసేలా వారిని సన్నద్ధం చేస్తామన్నారు. నెక్స్ జెన్ స్కూళ్లలోని పాఠ్య ప్రణాళిక క్లిష్టమైన ఆలోచనా విధానాన్ని ప్రోత్సహి స్తోందని, దానికి సిద్ధాంతిక జ్ఞానాన్ని ఆచరణాత్మక అనువర్తనాలతో మిళితం చేసే గీతం విద్యాబోధన తోడె విద్యార్థుల భవిష్యత్తును మెరుగు. పరుస్తుందని తెలిపారు. నెక్స్ జెన్ పాఠశాలల బహుభాషా విద్యా బోధన, ప్రాథమిక మాధ్యమంగా ఆంగ్లం, గీతం యొక్క ప్రపంచ దృక్పథాన్ని పూర్తిచేసి, విద్యార్థుల విద్యా పురోగతిని నిర్ధారిస్తుందన్నారు. ఈ భాగస్వామ్యం బోధనా పద్ధతుల్లో గణనీయమైన సర్దుబాట్ల అవసరాన్ని తగ్గించడమే గాక, విద్యార్థుల జ్ఞానం, నై పుణ్యాలను సమర్థంగా ఉపయోగించుకునేలా చేస్తుందని పేర్కొన్నారు.గుంటూరు, ఒంగోలులోని నెక్స్ జెన్ స్కూళ్ల డైరెక్టర్ శ్రీకాంత్ బి. కోగంటి ఈ సహ కారానికి తన మద్దతను ప్రకటిస్తూ తను పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు మంచి భవిష్యత్తును ఇవ్వడానికి, గ్లోబులైజ్ ప్రపంచంలో విజయానికి వారిని సిద్ధం చేసే సంపూర్ణ విద్యను అందించడానికి కృషి చేస్తున్నట్టు వివరించారు. ఈ భాగస్వామ్య ప్రకటనలో ది నెక్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్స్ నుంచి శ్రీవిద్య కోగంటి, గీతం రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ (సీఎంవో) నిర్మల్ రావు తదితరులు పాల్గొన్నట్టు తెలియజేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-జహీరాబాద్

1996 సంవత్సరానికి చెందిన న్యాల్కల్ మండల జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులు మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని అతిథి హోటల్లో 'పూర్వ విద్యార్థుల సమ్మేళనం'ను ఘనంగా నిర్వహించారు.ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా నాటి గురువులు గురువులు బుచ్చయ్య, సంజీవరావు, చంద్రశేఖర్, ప్రభాకర్లు హాజరై మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థిలో ఓ పరిజ్ఞానం ఉంటుం దని.. ఆ పరిజ్ఞానాన్ని గ్రహించి అధ్యాపకులు, గురువులు సదరు విద్యార్థికి తగు సూచనలు చేస్తారన్నారు. ఆ సూచ నలు పాటించినవారు జీవితంలో సక్సెస్ అవుతారన్నారు. అందరూ గురువుల బోధనలు విని.. ఉత్తమంగా జీవిం చాలనారు. అనంతరం గురువులను పూర్వ విద్యా ర్థులు సన్మానించారు. మృతి చెందిన ఉపాధ్యాయుల, తమ సహ చర విద్యార్థుల చిత్రపటాలకు పూలమాలలు వేసి కన్నీటి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు కుటుంబ సమేతంగా భోజ నాలను ఆస్వాదించి తమ గురువులకు పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో అధ్యాపకులు రాములు, కిషన్, నరసింహారెడ్డి విద్యార్థులు ఎంకే కుసురు, మఠం రామయ్య స్వామి, యాదయ్య, అన్వర్, నరసింహారెడ్డి, గీత, కృష్ణారెడ్డి, సంజీవ్, బిక్షపతి ,అన్వర్, షావుకత్ అలీ, రహీం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలి



నవతెలంగాణ-కల్హేర్

రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకొని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని ఏఈఓ భాస్కర్ తెలిపారు. మండల కేంద్రమైన కల్హేర్‌తో పాటు దామరచెరువు గ్రామాల్లో విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై రైతులకు మంగళవారంఅవగాహన కల్పించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొను గోలు చేసేటప్పుడు లూజ్‌గా ఉన్న విత్తనాల బ్యాగ్‌లను తీసుకోవద్దు అన్నారు. విత్తనాల బ్యాగ్‌లపై తయారైన తేదీ, ఎక్స్పై రీ డేట్ తప్పనిసరిగా చూసుకోవాలన్నారు. నకిలి విత్త నాలు గమనించి కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొను గోలు చేసిన షాపు గాని ఏజెన్సీ దగ్గరగా తప్పకుండా రసీదు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగయ్య, గ్రామాల రైతులు, పాల్గొన్నారు.

రేజింతల్‌లో.. తాగునీటి ఎద్దడి

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రేజింతల్ గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొన్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం బోర్లు చెడిపోయి నీటి కటకట మొదలైందని వాపోతున్నారు. కిలోమీటర్ల మేర నడిచిపోయి నీళ్లు తెచ్చుకుంటున్న దుస్థితి నెలకొన్నదని బాధపడుతున్నారు. పంచాయతీ సెక్రెటరీ మాత్రపీ సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా వెంటనే బోర్లు మరమ్మతులు చేయించి.. తమ దాహార్తిని తీర్చాలని ప్రజలు కోరుతున్నారు

పాఠశాల ప్రారంభంలోనే నోట్ బుక్స్ పంపిణీ చేస్తాం

- మండల విద్యాధికారి యాదగిరి



నవతెలంగాణ-వెల్దుర్తి

పాఠశాల పునః ప్రారంభం కాగానే విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేయడం జరుగుతుందని మండల విద్యాధికారి అరికల యాదగిరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనానికి మెదక్ జిల్లా నుంచి 1917 విద్యార్థులకుగాను 18663 నోట్ బుక్స్ రావడం జరిగిందన్నారు. కేజీబీవీ పాఠశాల స్పెషల్ అధికారి ఫాతిమాకు నోట్‌బుక్స్ అందజేయడం జరిగిందన్నారు. మిగతా పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు జూన్ 12 రోజున పాఠశాల ప్రారంభ కాగానే టెస్ట్ బుక్స్ నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నగరం గ్రామానికి చెందిన కొమ్మట రాజు (25) చేసిన అప్పుల తీర్చలేక ఉరివేసుకుని ఆత్మహ్యాత చేసుకున్నాడు. వ్యవసాయ పెట్టుబడి గురించి తెలిసిన వారి వద్ద సుమారు రూ.2 లక్షల అప్పుచేసి, పంట సరిగా పండక పోవడంతో అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది కొమ్మట రాజు ఈ నెల 27వ తేదిన జెసిబి డ్రైవింగ్‌కి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. 28వ తేదిన ఉదయం సమయంలో గ్రామస్థులు కొమ్మట రాజు వ్యవసాయ పొలం వద్ద గల భావి గడ్డపై మోదుగు చెట్టుకు తువాలతో ఉరి వేసుకొని మరణించాడని అతని భార్యకు సమాచారం అందించారు. మృతుడి భార్య కొమ్మట లక్ష్మీ ఫిర్యాదు మేరకు నిజాంపేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వడ్ల సాగులో అయోమయంలో అన్నదాతలు



- కొందరికే బోనస్!
- జిల్లాలో 80శాతం దొడ్డు వడ్ల సాగు
- ఏం వడ్లు సాగు చేయాలో తెల్చుకోలేని పరిస్థితి

నవతెలంగాణ-పెద్దశంకరంపేట

సన్నరకం వడ్లకు ఈ ఖరీఫ్ నుంచి క్వింటాల్‌కు రూ 500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణహించింది. ఈ మేరకు క్యాబినేట్ సమావేశంలో తీర్మానం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో మండల రైతులు అయోమయానికి గురువుతున్నారు. ఎన్నికలో వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు సన్నరకాలకే ఇస్తామని ప్రకటించడంపై రైతులు పెదవి విరుస్తున్నారు. మండలంలో 10 లక్షల ఎకరాలో ఏటా వరి సాగు చేస్తారు. ఇందులో 8 లక్షల ఎకరాలకు దొడ్డు రకం వడ్లు సాగుచేస్తారు. ప్రభుత్వ నిర్ణయంతో కేవలం 5 శాతం మంది రైతులకే లబ్ధి కల్గుతుంది.

నారు పోసేముందే ప్రకటన

మండలంలో వరిధాన్యం సాగుచేసే రైతులంతా నారు పోసేందుకు సిద్ధమవుతున్నారు. రోహిణి కార్తె ప్రవేశించగానే నార్లు పోసేందుకు పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే సన్నలకు బోనస్ ప్రకటన వచ్చింది. దీంతో రైతులు అయోమయంలో పడ్డారు. ఇక్కడ రైతులంతా సన్నాలు సాగుచేయాలా దొడ్డు వడ్లు పండించాలా అన్న అయోమయంలో ఉన్నారు. మరో వైపు మండలంలో దొడ్డు వడ్ల విత్తనాలకే డిమాండ్ ఉండంతో విత్తన దుకాణాల యజమానులు దొడ్డు రకం విత్తనాలే తీసుకొచ్చారు. ప్రభుత్వ ప్రకటనతో ఇప్పుడు కొందరు రైతులు సన్నలకు మొగ్గుచూపుతారని భావిస్తున్నారు.

దిగుబడి తక్కువే...

ఎకరం పొలంలో దొడ్డు రకం వరి ధాన్యం 25 నుంచి 32 క్వింటాల్ వరకు దిగుబడి వస్తుంది. అదే సన్న రకం 15 నుంచి 20 క్వింటాలు వరకు దాటదు. దొడ్డు రకం వరి తెగులను తట్టుకుంటున్నది.

సన్నరకాలకు తెగులు బెడదా ఎక్కువ.

సన్న రకం వడ్లు సాగుచేస్తే 60 శాతం దోమపోటు వచ్చే అవకాశం ఉంటుంది. సన్నరకం వడ్లకు సస్య రక్షణ చర్యలు చేపట్టలేక రైతు ఇబ్బంది పడతారు. రైతులకు దొడ్డు రకం సాగుచేస్తేనే కొంతమేర లాభాలు వస్తాయి పెద్దశంకరంపేట భూములో (నేలలో) దొడ్డు సాగుకే అనువుగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. దొడ్డు రకం వడ్లు 100 రోజూనే పంట చేతికి వస్తుందని సన్న రకాల పంట ఐదు నుంచి ఆరు నెలలు సమయం పడుతుందని పేర్కొన్నారు.

మార్కెట్‌లో డిమాండ్...

గత వర్షాకాలంలో పండించిన సన్న రకాల వడ్లు క్వింటాలు రూ 3 వేల నించి రూ 3200 వరకు పలికింది మార్కెట్‌లో సన్న రకం వడ్లకు మంచి డిమాండ్ ఉంది. మధ్యతరగతి వారంతా సన్న బియ్యమే తింటున్నారు. దింతో గత వర్ష కాలంలో సన్న రకం వడ్లకు మంచి ధర పలికింది. ప్రభుత్వం వరి ధాన్యం క్వింటాలుకు రూ 2203 ధర చెలిస్తుంది. సన్నరకం సాగు చేసిన రైతులకు మాత్రం దొడ్డు ధర వడ్ల ఇస్తుందని చేర్చుకుంటున్నారు.

దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలి

పాతులోతు రావుజ్యా నాయక్, జాముని నాయక్ తండా



దొడ్డు రకం వడ్లకు కూడా ప్రభుత్వం బోనస్ ప్రకటించాలి. ఎన్నికల సమయంలో వరి ధాన్యానికి మొత్తం బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు సన్న వడ్లకే ఇస్తామనడం సరికాదు. ప్రభుత్వం అందరికి బోనస్ ఇవ్వాలి.

సన్న రకంతో కష్టమే

కే కోటయ్య, బూర్గుపల్లి వ్యవసాయదారుడు



సన్నరకం వడ్ల సాగుతో రైతులకు ఇబ్బందులు వెంటాడుతాయి సన్నరకాలకు దోమ పోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దోమ పోటుతో దిగుబడి భారీగా తగ్గుతుంది. సన్న వడ్లు ప్రభుత్వానికి అమ్మినా పెద్దగా లాభం ఉండదు. ప్రైవేట్‌గా విక్రయిస్తేనే రైతులకు లాభం.

ధర పెంచాలి

బి భాగయ్య మెదక్ జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు.



సన్నరకం వడ్లు క్వింటాలుకు రూ 3200వరకు పలికింది. ప్రభుత్వం రూ 2203 ధర చెలిస్తుంది సన్నరకం వడ్లకు ప్రభుత్వం ధర పెంచాలి. ధర పెంచి బోనస్ ఇస్తే రైతులకు గిట్టుబాటు అవుతుంది. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి.

కొండగట్టుకు పాదయాత్రతో బయలుదేరిన హనుమాన్ భక్తులు



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని కల్వకుంట గ్రామం నుంచి 20 మంది హనుమాన్ మాలాదారులు కొండగట్టు వరకు పాదయాత్ర చేయడానికి బయలుదేరారు. మంగళవారం నుంచి 31 వ తారీకు వరకు కొండగట్టుకు చేరుకుంటారు. కొండగట్టు అంజన్న స్వామినీ దర్శించుకొని మొక్కులు చెల్లించెదరు. ఇందులో గురు స్వాములు అందే మాధవరెడ్డి, రావిపల్లి రవీందర్ రెడ్డి, కలచి గారి తిరుపతిరెడ్డి, మన్నే మహిపాల్, రంజిత్ కుమార్, బురాని బొమ్మ రాజ్, బొజ్జ మనోహర్, లక్ష్మీ నందీశ్వర్ రెడ్డి, అందే సాత్విక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

ఖాతాదారులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్బీఐ జనరల్ సెక్యూరిటీ ఆఫీసర్ ఆనందకుమారరాజ అన్నారు. మంగళవారం పేట ఎస్‌బీఐ శాఖలో ఖాతాదారులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఖాతాదారులు తమ వ్యక్తి వివరాలపై గోప్యత పాటిస్తూ జాగ్రత్త పడాలని సూచించారు. చరవాణి ద్వారా ఎవరూ ఎలాంటి వివరాలు అడిగిన చెప్పకూడదని ఖాతాల నిర్వహణలో ఎలాంటి సమస్యలు వచ్చినా నేరుగా బ్యాంకు సిబ్బందిని కలిసి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అపరిచితులకు చరవాణిలు ఇవ్వడం, వాట్సాప్లలో అనవసర లింక్లు ఓపెన్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్‌దోస్త్ ద్వారా పూర్తి అవగాహన పొందాలని, సైబర్ మోసాలు ఎదురైనపుడు వెంటనే 1930 నంబర్‌ను సంప్రదించి జాగ్రత్త పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పేట ఎస్బీఐ మేనేజర్ అటుల్ కృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ అశోక్ కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పాఠశాల ముందర గుంత



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని కనీస సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నది. మండల పరిధిలోని గ్రామాలలో అక్కడక్కడ సంపు, వైర్ ఫిట్టింగ్, బాత్రూం, ఫ్లోరింగు లాంటి పనుల కోసం ప్రభుత్వము లక్షల్లో నిధులను కేటాయించడం జరిగింది. కాంట్రాక్టర్ చేత పనులు చేయిస్తే అవినీతి జరిగే ప్రమాదం ఉందని, డాక్రా గ్రూపు మహిళల చేత పనులు చేయించడం చాలా హర్షించదగ్గ విషయమని మండలంలోని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నస్కల్ గ్రామంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాల ముందర పెద్ద గుంత తవ్వడం జరిగింది, పనులు మాత్రం చేయడం లేదు. అంగన్వాడి విద్యార్థులు గుంతలో పడే ప్రమాదం ఉంది. జూన్ 5 వరకు అన్ని పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలని ప్రభుత్వము ఆదేశించింది. ఇప్పటికీ గ్రామాలలో పనులు సగం వరకే జరిగాయని ఇంకా పూర్తి కావడం లేదని పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే పనులు జూన్ 5 వరకు పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

హెూరా హెూరీగా కుస్తి పోటీలు

- ఫైనల్ విజేతకు 10 తులాల
- వెండి కడియం బహుమతి



నవతెలంగాణ-టేక్మాల్

మండల పరిధిలోని కోడిమెట్పల్లి గ్రామంలో వీరభద్ర స్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను తగ్గించడానికి జిల్లా నలుమూలల నుండి ప్రజలు భారీగా తరలి వచ్చి తిలకించారు. కొబ్బరికాయ కుస్తీ నుంచి పది తులాల వెండి కడియం వరకు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొనడానికి మెదక్ జిల్లాతో పాటు మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాల నుంచి మల్ల యోధులు వచ్చి పాల్గొన్నారు. చివరి విజేత మహారాష్ట్ర లాతూర్ జిల్లా ఉద్గిర్ గ్రామం అభిజిత్ విజేత పది తులాల వెండి కడియాన్ని గ్రామానికి చెందిన కంకర సంఘయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్, శంకరప్ప, అవినాష్ కుమార్, ఉన్నదొడ్డి శ్రీనివాస్, భవాని అంజయ్య, వంపనూరు నర్సింలు, కంకర బీరప్ప, కలాలి రాజ గౌడ్ తదితరులు ఉన్నారు.

విత్తన కొనుగోలుపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని నందిగామ గ్రామంలో ఏడిఏ వసంత, సుగుణ రైతులకు విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వానకాలం సీజన్‌కి సంబధించి రైతులు విత్తనాలు కొనేటప్పుడు అధికృత లైసెన్సు డీలర్లు వద్ద మాత్రమే విత్తనాలు కోనాలని, అలాగే బిల్లు రసీదును పంట కాలం పూర్తి అయ్యే వరకు భద్రంగా పెట్టుకోవాలన్నారు. అదే విధంగా గ్రామాలలో ఇతర వ్యక్తులు వచ్చి విత్తనాలు అమ్మినప్పుడు కొనుగోలు చేయవద్దని, అలాగే విడి విత్తనాలు కూడా కొనవద్దని తెలియజేసారు. పలు విత్తన డీలర్స్ అవుట్‌లెట్‌లను కూడా సందర్శించడం జరిగింది. డీలర్‌కి ప్రతి రోజు రైతుకు విత్తన అమ్మకాల వారిగా నమోదు చేయాలని పేర్కొనడం జరిగింది. ప్రతి రైతుకి అమ్మిన వివరాలు కూడా ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారికి అందిచాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కావేరి, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆందోళనలు

- తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్
- (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-మెదక్

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మంగళవారం మెదక్ విద్యుత్ యస్ఈ జానకి రాములుకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జూన్ 10న సీఎండీలకు సామూహిక దరఖాస్తులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం కార్యాచరణ హైదరాబాదులో ఉంటుందని, విద్యుత్ శాఖలో అనేక సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశల వారి పోరాట కార్యక్రమాలు నిర్వహించనునట్లు తెలిపారు. విద్యుత్ శాఖ కార్మికులు, ఉద్యోగులు, ఆర్టిజన్లు మీటర్ రీడర్లు, బిల్ కలెక్టర్లు, కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తక్కువ సిబ్బందితో అనుకున్న విధంగా టార్గెట్లు రీచ్ అవుతున్నా. రోజువారి పని భారం ఎక్కువవుతుందని తెలిపారు. దీనికి అనుగుణంగా సిబ్బంది లేరని ఉన్నవారిపైనే పని భారం ఎక్కువైందని డిఎ, ఏరియర్స్ పెండింగ్లో ఉన్నాయని ప్రమోషన్లు, ఖాళీ భర్తీ, ఎప్పటినుండో ఉన్నదని, సీబీడి, ట్రాన్స్కో ఆనుమాన్ కార్మికుల సమస్యలు ఇందులో ఉన్నాయని వీటి పరిష్కారం కోసం ప్రభుత్వం చర్య తీసుకోవాలని కొత్తగా వచ్చిన ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని తెలిపారు. కానీ పరిష్కారం కావడం లేదని చెప్పారు. అందుకే ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు యం నర్సింలు, శ్రీశైలం, సలీం, సురేష్, రాజు, బాలరాజు, శ్రీనివాస్, దశరథ, దురయ్య, నరేశ్, పాల్గొన్నారు.

అక్రమంగా కుంట కట్టను చీల్చిన వెంచర్ యజమానులు

- తిరిగి మటిని నింపుతామనడంతో వెనుదిరిగిన గ్రామస్థులు
- సందర్శించిన ఇరిగేషన్ అధికారులు



నవతెలంగాణ-మనోహరాబాద్

వెంచర్ యజమానులు ఏకంగా కుంట కట్టను చీల్చి చదును చేయడంతో గ్రామస్థులు అడ్డుకుని ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించిన ఘటన తూప్రాన్ మండలం యావాపూర్ గ్రామ శివారులో మంగళవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం యావాపూర్ గ్రామ శివారులో కొందరు వెచర్‌ను ఏర్పాటు చేశారు. కాగా ఆ వెంచర్ నిర్వాహకులు గ్రామ శివారులో ఉన్న వెంచర్‌కు ఆనుకుని ఉన్న సువర్ణమ్మ కుంట కట్టను జేసీబి యంత్రాలతో చీల్చి చదును చేశారు. దాంతో గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసి యాంజాల స్వామి ఆధ్వర్యంలో గ్రాస్థులతో కలిసి వెళ్లి కుంట కట్టను ఎలాచీలుస్తారంటూ ఆందోళన చేపట్టారు, అనంతరం ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఇరిగేషన్ డీఈ శ్రీదర్, ఏఈ అనురాధలు వెళ్లి కుంట కట్టను చీలిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. వెంటనే వెంచర్ యజమానులు కుంట కట్టను యదావిధిగా మట్టిని పోస్తామని తెలిపారు. ఎవరైనా కుంటకట్టలను కబ్జా చేసినా, చీల్చినా వారిపై చట్టపరమైన చర్యలుంటాయని ఇరిగేషన్ డీఈ శ్రీధర్ హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

73

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి



నవతెలంగాణ- కొల్చారం

గాలి వాన బీభత్సంతో నివాస ఇల్లు కూలిపోయిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రంగంపేట, తుక్కాపూర్ గ్రామాల్లో పర్యటించిన ఆయన కూలిపోయిన నివాస ఇళ్ళను పరిశీలించి బాధితులకు మనోధైర్యం కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల ఈదురు గాలులతో కూలిపోయిన నివాస ఇళ్లకు ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందజేసేందుకు కృషి చేస్తామని భరోసానిచ్చారు. ఎవరు అధైర్య పడద్దని ప్రతి ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని సూచించారు. అంతకు ముందు కిష్టాపూర్ గ్రామంలో గుండె నొప్పితో మరణించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పుట్నాల రఘుపతి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు సుహాసినిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్, మధుసూదన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీరాములు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బండి మల్లేశం, రంగంపేట మాజీ సర్పంచ్ బండి రమేష్, రంగంపేట గ్రామ శాఖ అధ్యక్షులు గొండా కృష్ణ, సంగాయపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగం గుడ్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మారెళ్లి అనిల్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు అల్లు మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నవాజ్ రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తుక్కాపూర్ మాజీ సర్పంచ్ శ్రీశైలం, జైపాల్, నవీన్, రాములు, వెంకట్ గౌడ్, జయరాం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు జూన్ 5లోగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-పాపన్నపేట

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను జూన్ 5వ తేదీ వరకు పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి రాధా కిషన్ సూచించారు. ఈ మేరకు మంగళవారం పాపన్నపేట మండల పరిధిలోని ఎల్లాపూర్, పొడిచాన్పల్లి, అరికెల తమ్మాయి పల్లి, లక్ష్మీ నగర్ తదితర పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. పనులు త్వరి తగతిన పూర్తి చేయాల ని సూచించారు. ఆయన వెంట మండల విద్యాధి కారి నీల కంఠం. కాంప్లెక్స్ హె చ్ ఎం, సురేందర్ గౌడ్, నవాజ్ రెడ్డి పాల్గొన్నారు.

వీర సావస్కర్ గొప్ప స్వాతంత్ర సమరయోధుడు

- తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్



నవతెలంగాణ-చేగుంట

వీర సావస్కర్ బ్రిటిష్ అధికారాన్ని ధిక్కరించి స్వాతంత్ర పోరాటాన్ని వారి దేశ రాజధాని నడిగడ్డకు తీసుకువెళ్లిన విప్లవ వీరుడని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్ల లక్ష్మణ్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో చేగుంట మండల కేంద్రంలో వీర సావర్కర్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ వీర సావర్కర్ 28 మే 1883న మహారాష్ట్రలోని నాసిక్ నగరానికి సమీపంలోని భాగూర్ గ్రామంలో మరాఠీ హిందూ చిత్పవన్ బ్రాహ్మణ కుటుంబంలో దామోదర్, రాధాబాయి సావర్కర్ దంపతులకు జన్మించారని తెలిపారు. వినాయక్ దామోదర్ వీర సవర్కర్ ఈ పేరు వినగానే భారతీయులందరి మదిలో దేశభక్తి ఉప్పొంగుతుందన్నారు. బ్రిటిష్ అధికారాన్ని ధిక్కరించి స్వాతంత్ర పోరాటాన్ని వారి దేశ రాజధాని నడిగడ్డ మీదకు తీసుకెళ్లిన విప్లవ వీరుడని, ఎందరో విప్లవకార్లకు స్వాతంత్ర్య సమర వీరులకు స్ఫూర్తినిచ్చిన గొప్ప వీరుడన్నారు. 27 సంవత్సరాలు అండమాన్ జైల్లో దుర్భర జీవితం గడిపిన గొప్ప యోధుడని, 1857లో జరిగింది సిపాయిల తిరుగుబాటు కాదని మొదటి స్వాతంత్ర సంగ్రామమని అన్న మొదటి వ్యక్తి వీరసావర్కరే అని అన్నారు. అంటరానితనం నిర్మూలన గురించి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసిన మొదటి సంఘసంస్కర్త అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో చేగుంట తపస్ మండల అధ్యక్షుడు రావుల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బాల్ శెట్టి రేఖ, జిల్లా కార్యదర్శులు, ఆంజనేయులు, పట్లూరి యాదగిరి, తపస్ బాధ్యులు దేవానంద్, మధుసూదన్ రెడ్డి, రాజేశ్వర్, ప్రవీణ్, పులి రమేష్, సుభాష్ గౌడ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

నాగరాజ్‌పై దాడికి కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదు



నవతెలంగాణ-నిజాంపేట

గత మూడు రోజుల క్రితం రామాయంపేటలో కౌన్సిలర్ బీఆర్ఎస్ అధ్యక్షులు గజవాడ నాగరాజుపై పెట్రోల్ పోసి దాడి చేసిన సంఘటనకు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని నిజాంపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు ఈ సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముత్యం రెడ్డి, సత్యనారాయణరెడ్డిలు మాట్లాడుతూ వ్యక్తిగత కక్షల వలన దాడి జరిగిందని ఆర్థిక లావాదేవీల విషయంలో గొడవ జరిగిందని ఆ గొడవకు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని తాము కూడా కోరుతున్నామన్నారు. దాడులను ఎవరు ప్రోత్సహించరని అది మంచి పద్ధతి కాదన్నారు. ఏ పార్టీ వారైనా సరే దాడులు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు కావాలని కాంగ్రెస్ పార్టీని బదనాం చేస్తున్నారన్నారు. నిందితుడు పోచమ్మల గణేష్ బీఆర్ఎస్ పార్టీలో పనిచేసిన వ్యక్తి, బీజేపీలోకి మారడం కూడా జరిగిందని చివర సారిగా కాంగ్రెస్ పార్టీలోకి రావడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం కూడా ఇటువంటి దాడి చేసిన వారికి సపోర్ట్ చేయదన్నారు. ఎమ్మెల్యే రోహిత్ రావుకి మంత్రి పదవి వస్తుందని అక్కసుతోనే కావాలనే కాంగ్రెస్ పార్టీపై బదనాం లేపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మహేందర్, మారుతి, వెంకటేష్ గౌడ్, వినోద్, శ్రీనివాస్, మోహన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బాబు, రమావత్ రాజు, గరుగుల సుధాకర్, నరేందర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ నాయకుల పరామర్శ

- కాంగ్రెస్ పార్టీ తరపున అండగా నిలుస్తాం
- ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులు గౌడ్, చిలుముల సుహాసిని రెడ్డి



నవతెలంగాణ-చిలిపిచేడ్

మండల పరిధిలోని శిలంపల్లి, చిలిపిచెడ్, ఫైజాబాద్ గ్రామాలలో మంగళవారం బాధిత కుటుంబాలను నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు చిలుముల సుహాసిని రెడ్డిలు పరామర్శించారు. చిలిపిచెడ్‌లో గొట్టం నందు ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. శీలం పల్లి గ్రామంలోని మాసన్నగారి నరసింహారెడ్డి తల్లి ఇటీవల మరణించగా పరామర్శించారు. ఫైజాబాద్ గ్రామంలో అంతి రెడ్డి గారి శేషి రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. తలారి రాజు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కర్ణాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పండరి, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న హనుమాన్ భక్తులు



నవ తెలంగాణ మిరుదొడ్డి

మిరుదొడ్డి మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ మాల ధారణ భక్తుల ఆధ్వర్యంలో మంగళవారం 108 సార్లు చాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఇరుముడులు కట్టుకొని ప్రత్యేక పూజలు చేశారు. మాలధారణ నియమాలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజపున్నయ్య శర్మ, చంద్రశేఖర శర్మ, గురు స్వామి ఆంజనేయులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో అధికారుల తనిఖీ



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం గౌరవెల్లి, గుబ్బడి గ్రామాలలో ఫెర్టిలైజర్ షాపులను వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత, ఎస్ఐ తాండ్ర వివేక్ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణ దారుని యొక్క లైసెన్స్, అలాగే విత్తనాల ప్యాకెట్లను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని అన్నారు. విత్తనాలు తీసుకునే ప్రతి రైతుకు రిసిప్ట్ ఇవ్వాలని తెలియజేశారు. అలాగే నకిలీ విత్తనాలు అస్సలు అమ్మకూడదని, దీనివల్ల రైతులు నష్టపోతారని ఫర్టిలైజర్ యాజమాన్యానికి తెలియజేశారు. ఆ తర్వాత దుకాణం అంతా తనిఖీ చేసి రికార్డులు కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తాండ్ర వివేక్, రైతులు భైరగోని శ్రీనివాస్, తిరుపతి, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయ స్వామి దేవాలయంలో హోమం



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని నర్సాయ పల్లి గ్రామంలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో రేబర్తి పిఏసిఎస్ మాజీ చైర్మన్ కామిడీ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో హనుమాన్ మాలాధారణ స్వాములతో కలిసి హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనగామ కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షుడు నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి. ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. హోమం సందర్భంగా హనుమాన్ మాలధారణ స్వాములకు గ్రామస్తులకు. కొమ్మూరి శ్రీలత , శ్రీనివాస్ రెడ్డి, ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గిరి కొండల్ రెడ్డి, దూల్మిట్ట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోలా సాయిలు, మద్దూరు మండల ఉపాధ్యక్షుడు ముస్త్యాల మనోహర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయిని శ్రీనివాస్. బొమ్మగాని శివయ్య. తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి పెద్దపీటవేసిన కేసీఆర్

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గత ప్రభుత్వంలో పెద్దపీట వేశారని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి గుర్తు చేశారు. మంగళవారం గజ్వేల్ మండలం అమ్మదీపూర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ కల్యాణ వార్షికోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. పది సంవత్సరాలుగా మన సంస్కృతి తెలంగాణ ప్రభుత్వం భారీ నిధులు ఇచ్చి ప్రోత్సహించించారన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ దేవతల వార్షికోత్సవాలు జరుగుతున్నాయంటే కేసీఆర్ పుణ్యమేనన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇలాంటి కార్యక్రమాలు ఎప్పుడు జరగలేదన్నారు. 2014లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు ప్రతి పల్లె తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టిందన్నారు. గత ప్రభుత్వంలోనే అమ్మదిపూర్ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచిన ఘనత ఉందన్నారు. రేణుక ఎల్లమ్మ దీవెనలతో తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, నాయకులు మద్ది రాజిరెడ్డి, చాడ శ్రీనివాస్ రెడ్డి, పాల రమేష్ గౌడ్, హైమద్, నిజాం తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డి విజయం ఖాయం

- మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి



నవతెలంగాణ-గజ్వేల్

మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకటరామ్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అసమర్ధత పాలన వల్లనే తెలంగాణలో కరువు వచ్చిందని. మూడు నెలల కాలంలోనే బిఆర్ఎస్ లేని లోటు తెలుస్తుందన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌తో పాటు నియోజకవర్గంలో ఏ మండలంలో వెళ్లిన బి ఆర్ ఎస్ పార్టీ వైపే ప్రజలు ఉన్నారని సమాచారం వస్తుందన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో కెసిఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధికి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీ కి ఓట్లు వేశారని ఆయన గుర్తు చేశారు.కాంగ్రెస్ అబద్ధాలతో అధికారంలోకి వచ్చి కరువు తెచ్చిందన్నారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాతలు సాగునీరు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంటలకు నీళ్ల లేవు పండిన పంటలు కొనే పరిస్థితి లేదు హామీ ఇచ్చిన బోనస్ ఊసే లేదని అన్నారు. కాంగ్రెస్ మాయ మాటలకూ గజ్వేల్ ప్రజలు మోసపోలేదన్నారు. మున్సిపల్ పరిధిలో 20 వార్డుల్లో కాంగ్రెస్ భారీ మెజార్టీని సాధిస్తుందన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు కృషితో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు.

బోరు మోటార్ల చోరి

- కాశిరెడ్డిపల్లిలో ఘటన



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని కాశిరెడ్డిపల్లి గ్రామంలో వ్యవసాయ బోరు మోటార్లు గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించిన సంఘటన గత నాలుగు రోజుల క్రితం చోటు చేసుకుంది. మంగళవారం బాధితుల ఫిర్యాదు మేరకు మర్కుక్ ఇంచార్జి ఏఎస్ఐ రమణారెడ్డి సంఘటన ప్రాంతాన్ని పరిశీలించి త్వరలోనే దుండగులను పట్టుకుంటామని రైతులకు బరోసా కల్పించారు.గ్రామానికి చెందిన కుమ్మరి యాదగిరి, గొల్ల సత్తయ్య,డాల్ నర్సయ్య,వల్లపు మల్లయ్య,కుతూరు యాదయ్య,గురు నానక్ సురేష్ లవి 7 ఎచ్ మోటార్లు, గతంలో కెబుల్ వైర్లు,పశువులకు గడ్డి కట్ చేసే కుట్టి మిషన్ మోటార్ తొగిలించారు. త్వరలోనే దొంగలను పట్టుకుని రైతులకు న్యాయం చేస్తామని పోలీసులు హామీ నిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు దుబ్బాక యాదగిరి, బాలయ్య గ్రామస్తులు తదితరులున్నారు.

బాల సాహిత్య సమ్మేళనంకు రావాలని కాంతి కృష్ణకు ఆహ్వానం



నవతెలంగాణ-చేర్యాల

తెలంగాణ సారస్వత పరిషత్తు హైదరాబాద లో నేడు,రేపు నిర్వహించే మాతృమూర్తి శ్రీమతి కోడూరు శాంతమ్మ స్మారక బాలసాహిత్య సమ్మేళనం లో పాల్గొనేందుకు పరిషత్తు అధ్యక్ష,కార్యదర్శులు ఆచార్య శివారెడ్డి, డాక్టర్ చెన్నయ్య నుంచి తనకు ఆహ్వానం పంపారని చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన బాలసాహితీవేత్త,ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుళ్ళపల్లి తిరుమల కాంతి కృష్ణ మంగళవారం తెలిపారు. సారస్వత పరిషత్తు సమావేశమందిరంలో నిర్వహించే కార్యక్రమంలో "బడిలో తెలుగుభాష" అనే అంశంపై నిర్వహించే చర్చాగోష్టిలో కాంతికృష్ణ పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయనున్నారు. కాంతికృష్ణ బాలసాహిత్యంలో ఇప్పటికే ఊయల లాంటి పలు పుస్తకాలను రచించడమే కాక విద్యార్థులను ప్రోత్సహించి వారి రచనలకు పుస్తక రూపాన్ని కల్పించాడు. ఈ అవకాశం పొందిన కాంతికృష్ణను చేర్యాలకు చెందిన కవులు సాహిత్యాభిమానులు అభినందించారు.

వేం నరేందర్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-సిద్దిపేట

సీఎం వ్యవహారాల ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు టిపిసిసి మెంబర్ దరిపల్లి చంద్రం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సిద్దిపేటలో అభివృద్ధి పనులను అడ్డుకున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారన్న విషయాన్ని వేం నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకుపోగా అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభిస్తామని ఆయన భరోసా ఇచ్చినట్లు తెలిపారు. నర్సింగ్ కాలేజీతో పాటు, ఆగిపోయిన రహదారి పనులు కూడా ప్రారంభమవుతాయని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు వెంకటేష్, ఉద్యమకారుడు ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నంగునూరులో హనుమాన్ శోభ యాత్ర



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల కేంద్రంలో హనుమాన్ దీక్ష దారులు మంగళవారం హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ విగ్రహ ప్రతిమను రథంపై పెట్టి అలంకరించి భజన కీర్తనాలు, జై శ్రీరామ్ జై హనుమాన్ అంటూ గ్రామ పురవీధుల్లో శోభ యాత్ర చేపట్టారు. మహిళలు భక్తి శ్రద్ధలతో మంగళ హారతులతో స్వాగతం పలికారు. రాంచంద్రాపూర్ హనుమాన్ దేవాలయం వద్ద స్వాములకు భిక్ష వితరణ చేశారు.

ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న విజయం ఖాయం

- యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్



నవతెలంగాణ-మద్దూరు

వరంగల్, ఖమ్మం, నల్లగొండ, పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న విజయం ఖాయమని యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ అధ్యక్షుడు చేట్కూరి కమలాకర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్, నల్లగొండ, ఖమ్మం, పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి తీన్మార్ మల్లన్న భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పట్టభద్రులు తీన్మార్ మల్లన్న ను ఎమ్మెల్సీగా గెలిపిస్తారని ఆయన తెలిపారు.

రోడ్డును తవ్వి..భూమి దోపిడి...

- అక్రమణకు గురవుతున్న ఎల్లంపల్లి-లక్ష్మీపూర్ రోడ్డు
- ఒకరిని చూసి మరోకరు చదును చేసుకుంటూ పోలాలు
- అక్రమణ గురవుతున్న రోడ్డును కాపాడాలని గ్రామస్తుల విజ్ఞప్తి





నవతెలంగాణ-బెజ్జంకి

గత ఏడాది క్రితమే పంచాయితీ రాజ్ నిధులతో ప్రభుత్వం కల్వర్టుల నిర్మాణం చేపట్టి మట్టి రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది. నిర్మాణ పనుల సమయంలో తుతూ మంత్రంగా సందర్శించి సంబంధిత అధికారులు పనులను పర్యవేక్షించారనే ఆరోపణలున్నాయి. మండల కేంద్రం నుంచి ఎల్లంపల్లి మీదుగా లక్ష్మీపూర్ గ్రామ శివారు వరకు గత ఏడాది మట్టితో అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టారు. లక్ష్మీపూర్ గ్రామంలోని కొందరు రైతులు తమ భూములను చదునుచేసుకుంటూ రోడ్డును తవ్వి భూమిని దోపిడి చేస్తూ అక్రమించుకుని పోలాలు చేపట్టారు. ఒకరిని చూసి మరోకరు రోడ్డును తవ్వి దోపిడి చేస్తూ అక్రమించుకోవడంతో వాహనాలు సాఫీగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రైతులు రోడ్డును తవ్వి యథేచ్ఛగా దోపిడి చేస్తూ పోలాల చేసుకోవడంతో అధికారులు ఉన్నారా? లేదా? రోడ్డును తవ్వి దోచుకునే వారికి ప్రభుత్వాధికారులు వత్తాసు పలుకుతున్నారంటూ గ్రామస్తులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అక్రమణకు గురైన రోడ్డును కాపాడాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మధ్యలో నుంచి ఇరువైపుల 33 ఫీట్ల రోడ్డు

సాజీద్, ఆర్ అండ్ బీ ఏఈ.

ఎల్లంపల్లి-లక్ష్మీపూర్ వరకు మట్టితో నిర్మించిన రోడ్డు ఆర్ అండ్ బీ పరిధిలోకి తీసుకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాము. ప్రభుత్వ అనుమతుల మేరకు రోడ్డు మధ్యలో నుంచి ఇరువైపుల సుమారు 33 ఫీట్ల వరకు రోడ్డుకు తీసుకుంటాము. రోడ్డును తవ్వి రైతులు పోలాలు చేసుకోవడం సరైందికాదు. ప్రభుత్వ అనుమతుల మేరకు రోడ్డు నిర్మాణంలో అక్రమణకు గురైన భూమిని స్వాదీనం చేసుకుంటాం. రోడ్డును సందర్శించి పరిశీలించి చర్యలు చేపడుతాం.

విత్తనాల కొనుగోళ్లపై రైతులకు అవగాహన సదస్సు







నవతెలంగాణ-మద్దూరు

రైతులు వర్షాకాలంలో వేసుకునే విత్తనాల కొనుగోళ్లపై జాగ్రత్తలు తీసుకోవాలని మద్దూరు ఏఈఓ రాకేష్ అన్నారు ఈ సందర్భంగా మండలంలోని ధర్మారం గ్రామంలో విత్తనాల కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పంటల సాగు విధానంలో పంట ఉత్పత్తులను అధికంగా సాధించాలంటే నాణ్యమైన విత్తనాన్ని ఎంచుకోవడం చాలా కీలకమన్నారు. విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోనియెడట పంట సాగులో విత్తనాలు మొలకెత్తకపోవడం ఎక్కువగా తెగులు ్ర చీడ పీడలు ఆశించడం వంటి సమస్యలను రైతులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రైతులు విత్తనాలు ఎంపిక చేసుకునే క్రమం లో కొన్ని జాగ్రత్తలు పాటించి లైసెన్సు పొందిన విత్తన షాపుల వద్దనే కొనుగోలు చేసుకోవాలన్నారు. అలా కొనడం ద్వారా పంట నష్టం జరిగినప్పుడు రైతులు వ్యవసాయ అధికారులని సంప్రదించి పంట నష్ట పరిహారం పొందవచ్చన్నారు. .విత్తన సంచులపై లాట్ నంబర్ విత్తన రకం గడువు తేది, తదితర వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత డీలర్ వద్ద రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి అని ఆయన తెలిపారు. పంట నష్టం జరిగితే రైతుకు రశీదే కీలక ఆధారం కాబట్టి పంట కోత చేసేవరకు రసీదు నీ జాగ్రత్తగా భద్రపరుచుకోవాలన్నారు. సీల్ తీసిన విత్తన సంచులు పగిలిన విత్తన ప్యాకెట్లు మూత తీసిన డబ్బాలో విత్తనాలు కొనుగోలు చేయరాదు అని పేర్కొన్నారు ఈ కార్యక్రమం లో రైతులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -నంగునూరు

రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రశీదును తప్పనిసరిగా తీసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారులు తెలిపారు. మంగళవారం నంగునూరు మండల పరిధిలోని ముండ్రాయి, అప్పలాయచెరువు, నర్మెట ఘణపూర్ తదితర గ్రామాల్లో విత్తన కొనుగోలులో తీసుకోవలసిన జాగ్రత్తలపై వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లూజుగా ఉన్న సంచులలో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయరాదని, రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని,విత్తన ప్యాకెట్ బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలని, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ప్యాక్ చేసిన, లేబుల్ వేసిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. గడువు ముగిసిన విత్తనాలను కొనుగోలు చేయవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు అశోక్, మీరాబాయి, రేఖా పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొండపాక

కాలం చెల్లిన ఎరువులు విత్తనాలు క్రిమిసంహారక మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని గజ్వేల్ ఏ డి ఏ బాబు నాయక్ హెచ్చరించారు. మంగళవారం రోజున మండల పరిధిలోని వెలికట్ట గ్రామ శివారులో ఉన్న ఆగ్రో రైతు సేవ కేంద్రాన్ని విజిలెన్స్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు మరియు ఎక్స్పైరీ మందులను అమ్మినచో కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏ స్టాక్ వచ్చిన బిల్లుతో పాటు పి సీలు తప్పనిసరిగా ఉండాలన్నారు. స్టాక్ రిజిస్టర్ ,స్టాక్ బోర్డు ను తప్పక ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరైనా ఊర్లలో లూజ్ పత్తి విత్తనాలు అమ్మినచో పిడి యాక్ట్ కేసులు పెడతామని చెప్పారు. రైతులకు తప్పనిసరిగా బిల్లును ఇవ్వాలని, కాటన్ సీడ్ బోల్ గార్డ్ టు పత్తి సీడును మాత్రమే పెట్టాలని సూచించారు ఎమ్మార్పీ కంటే ఎక్కువ అమ్మకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్సై సాయిరాం, మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని ఏఈఓ రమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ 101 వ జయంతి వేడుకలు





నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 101 వ జయంతి వేడుకలను మంగళవారం పార్టీ కార్యాలయంలో హుస్నాబాద్ నియోజకవర్గ ఇఛార్జ్ బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజమే దేవాలయం ప్రజలే నా దేవుళ్ళు అనే నినాదంతో తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేశారన్నారు. పార్టీ స్థాపించిన 9 నెల్లలోనే అధికారం చేపట్టరని ,రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాలకు సంక్షేమం,రాష్ట్ర అభ్భీద్ధికి విశేష కృషి చేసిన మహానాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ పట్టణ అధ్యక్షులు వరయోగుల శ్రీనివాస్ ,మండల కార్యదర్శి బత్తుల శంకర్, సీనియర్ నాయకులు హసన్, వెంకటేష్,రాజు, తదిదరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు యుగపురుషుడని, సూర్యచంద్రులు ఉన్నంతకాలం చిరస్మరణీయునిగా ప్రజల మదిలో ఉంటారని టీడీపీ నాయకులు కొనియాడారు. చేర్యాల మండల అధ్యక్షుడు ఏల శ్రీనివాస్,పట్టణ అధ్యక్షుడు మిట్టపల్లి నారాయణరెడ్డి అన్నారు.ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మంగళవారం చేర్యాల పట్టణ కేంద్రంలో ఆయన చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జరిగిన పాలనకు ఎన్టీఆర్ ఆద్యులని అన్నారు.తెలుగు జాతి ఖ్యాతిని ఖండాంతరాలుగా వ్యాపింపజేసిన నేత అని,రాజకీయాలకు కొత్త నిర్వచనం చెప్పిన ఆయన తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతినిధిగా ఖ్యాతి గడించారని తెలిపారు. ఎప్పటికీ ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఈ కార్యకమంలో పట్టణ కార్యదర్శి నంగి శ్రీరాములు,తెలుగు యువత రాష్ట్ర నాయకులు మధుసాగర్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి పాము శివలింగం, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు ఎండి. ఎక్బాల్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు జీలుగు విత్తనాలు అందజేయాలి

- బీఆర్ఎస్ నాయకులు చింతకింది మంజూర్



నవతెలంగాణ-రాయపోల్

రైతులకు జిలుగ విత్తనాలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చింతకింది మంజూర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు రాజ్యమంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిందేమీ లేదని విమర్శించారు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు ముందస్తుగా జిలుగ విత్తనాలు అందకపోవడంతో రైతులు షాపుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. వానాకాలం సీజన్‌లో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచే విధంగా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రారంభ దశలోని జిలుగు విత్తనాలు అందించలేని ప్రభుత్వం రానున్న ఖరీఫ్‌లో విత్తనాలు ఎలా అందిస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాయపోల్ మండలానికి శాశ్వత వ్యవసాయ అధికారి లేకపోవడం వలన మండల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని. కేవలం ఏఈఓల ద్వారా సమస్యలను తెలుసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వారు కూడా సమయపాలన పాటించడం లేదన్నారు. దీంతో మండల రైతులకు అనేక కష్టాలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు స్పందించి మండలానికి శాశ్వత మండల వ్యవసాయ అధికారిని నియమించి రైతులకు అందాల్సిన జిలుగు, పచ్చి రొట్టె విత్తనాలతో పాటు రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఎప్పటికప్పుడు వీటి అమ్మకాలపై వ్యవసాయ అధికారులు నిఘా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. ఫర్టిలైజర్ దుకాణలల్లో నకిలీ విత్తనాలు విక్రయించకుండా అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ అధికారులు మండల రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆయన పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం



నవతెలంగాణ- గజ్వేల్

స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని ఈ ఎన్నికల్లో సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ యువజన అధ్యక్షులు తూముకుంట అంక్షారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం అవుతుందన్నారు. ఇకనుంచి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పై చేయి సాధిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్, మండల, జిల్లా పరిషత్, సింగిల్ విండో చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటుతుందని ఆమె పేర్కొన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ ప్రజలను పట్టించుకోవడంలేదని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో గజ్వేల్ నియోజకవర్గం ప్రజలకు తాము అందుబాటులో ఉన్నామని ఆమె పేర్కొన్నారు. గజ్వేల్ ప్రజలు కేసీఆర్‌పై నమ్మకంతో మూడుసార్లు ఓట్లు వేసి గెలిపిస్తే మొఖం కూడా చూపించడం లేదన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి రెండుసార్లు ముఖ్యమంత్రి చేసిన కేసీఆర్ గజ్వేల్ అభివృద్ధికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి పై సవతి ప్రేమ చూపించి అభివృద్ధిని హరీష్ రావు అడ్డుకున్నారన్నారు. బీసీ నేత కాంగ్రెస్ అభ్యర్థి నీలమదును భారీ మెజార్టీతో గెలుస్తారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్యలు వచ్చిన నర్సారెడ్డి అందుబాటులో ఉంటున్నారని ఆమె తెలిపారు.

మండలానికి సరిపడా విత్తనాలు, ఎరువులు



నవతెలంగాణ-జగదేవపూర్: రైతులకు విత్తనాల కొనుగోలులో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. మండలంలో మంగళవారం పీర్లపల్లి, గోపాల్పూర్, పి.టి వెంకటాపూర్ , రాయవరం, చిన్న కిష్టాపూర్, జంగం రెడ్డిపల్లి గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. పీర్లపల్లి గ్రామంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో వసంతరావు మాట్లాడుతూ ఈ వానా కాలానికి సరిపడా పత్తి, వరి, మొక్కజొన్న పంటలకు సంబంధించి విత్తనాలు మండలానికి సరిపడా అందుబా టులో ఉంచామని తెలిపారు. రైతులు తప్పనిసరిగా లైసెన్స్ పొందిన దుకాణాల ద్వారానే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. ఇప్పటివరకు పత్తి 40,000 పాకెట్ల వరకు, వరి 750 క్వింటాళ్ల , మొక్కజొన్న 50 క్వింటాళ్ల మార్కెట్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే యూరియా 200 టన్నులు, డి ఏ పి 50 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 250 టన్నుల వరకు ఉన్నాయని రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. రైతులు ఒకే రకానికి ప్రాముఖ్యత ఇవ్వకుండా మార్కెట్లో ఉన్న అన్ని మంచి రకాలను కొనుగోలు చేయాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువు జీలుగ విత్తనాలు మరొక 40 క్వింటాళ్లు (133 బాగ్స్) అందుబాటులోకి వచ్చాయని రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గర ఆన్లైన్లో కూపన్ పొంది డీసీఎంఎస్ రైతు సేవ కేంద్రం జగదేవపూర్ నందు డబ్బులు చెల్లించి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సమత, కిరణ్, భాను ప్రకాష్, కృష్ణమూర్తి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి..

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-మెదక్



జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళు తుది దశలో ఉన్నాయని, వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసి మిల్లులకు తరలించటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలియజేశారు. మంగళవారం మెదక్ మండలంలోని మాచవరం పరిధిలోని చిట్యాల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. ఈ సీజన్లో చిట్యాల కొనుగోలు కేంద్రంలో 116 రైతుల నుండి 4735.60 క్వింటళ్ళ ధాన్యం కొనుగోలు చేయటం జరిగినట్లు తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రం నందు మిగిలి ఉన్న ధాన్యాన్ని మూడు రోజుల్లో కొనుగోలు పూర్తి చేసి, మిల్లులకు తరలింపు పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. గత యాసంగి సీజన్లో జిల్లాలో ఈరోజు నాటికి 1,78,374.760 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయటం జరిగిందన్నారు. 410 కొనుగోలు కేంద్రాలలో పదమూడు (13) కొనుగోలు కేంద్రాలలో మాత్రమే ధాన్యం కొనుగోలు పూర్తి చేసారన్నారు.నుంచి కొనుగోలు చేసి రూ.436.51 కోట్లు చెల్లించడం జరిగిందని, 235 కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు పూర్తి అయ్యిందని తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విజయం ఖాయం

నవతెలంగాణ-మర్కుక్ (ములుగు)



మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని గంగిశెట్టి గణేష్ గుప్తా అన్నారు. మంగళవారం ఆయన ములుగు మండల పరిధిలోని కొట్యాల గ్రామంలో మాట్లాడుతూ మెదక్‌లో ఎగిరేది బీఆర్ఎస్ జెండానేనని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరెంటు, నీటి కష్టాలు మొదలయ్యాన్నారు. రాష్ట్రంలో అత్యధిక స్థానాలను బీఆర్ఎస్ అభ్యర్థులు కైవసం చేసుకుంటారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల విధానాలపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, బీఆర్ఎస్ సునాయాసంగా విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఎన్ని మాయ మాటలు చెప్పిన ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని కాంగ్రెస్ పార్టీ హామీల అమలులో విఫలమయినందున ప్రజలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు.

1న జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు

నవ తెలంగాణ-సిద్దిపేట

స్థానిక స్టేడియం మైదానంలో ఈ నెల 31న ఉదయం 8 గంటలకు జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు ఉంటాయని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శిలు గ్యాదరి పరమేశ్వర్, కర్రోళ్ళ వెంకట స్వామి గౌడ్ తెలిపారు. మంగళవారం పట్టణంలో వారు మాట్లాడుతూ ఈ ఎంపికలు అండర్-8,10,12,14,16,18,20, ఓపెన్ విభాగంలో బాల, బాలికలకు, స్త్రీ, పురుషులకు వేరువేరుగా ఎంపికలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 30న సాయంత్రం ఐదు గంటల లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పాల్గొన్న క్రీడాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్, మొదటి మూడు స్థానాలు నిలిచిన వారికి పతాకాలు, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేయడం జరుగుతుందని తెలిపారు. అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జూన్ 6,7న హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయబడుతుందన్నారు. పూర్తి వివరాలకు కృష్ణ కుమార్ 9704661898, నిషాంక్ గౌడ్ 8501977079, 9704061543 సంప్రదించాలని సూచించారు.

నకిలీ విత్తనాలు ఎవరైనా విక్రయిస్తే చర్యలు తప్పవు

- రైతులకు సబ్సిడీ ద్వారా ఎరువులు సకాలలో అందిస్తాం
- వ్యవసాయ అధికారి మల్లేశం



నవ తెలంగాణ-మిరుదొడ్డి

నకిలీ విత్తనాలు ఎవరైనా విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి మల్లేశం హెచ్చరించారు. దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి మండలంలో ఉన్న విత్తన షాపులను పోలీస్ అధికారతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు విత్తన కొనుగోలు చేసే సమయంలో ఖచ్చితంగా రశీదులు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ శాఖ ధ్రువీకరించిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని లేదంటే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే డీలర్లు విత్తనాలు విక్రయించాలని నిబంధనలు ఉల్లంఘించవద్దని సూచించారు. సబ్సిడీ ద్వారా వచ్చే రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బుక్య నాయక్, ఏఈవోలు సాయికుమార్ ,లోహిత్ పలువురు పాల్గొన్నారు.

సబ్బుబిళ్ల మీద ఎన్టీఆర్ చిత్రం

- ఘన నివాళులు అర్పించిన రామకోటి రామరాజు

నవ తెలంగాణ-గజ్వేల్



మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 101వ జయంతిని పురస్కరించుకుని సబ్బుబిళ్ల మీద ఎన్టీఆర్ చిత్రాన్ని అద్భుతంగా చిత్రించి ఘన నివాళులు అర్పించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ఎన్టీఆర్ చిత్రాన్ని చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిఖ్యాత, నటసార్వభౌమ నందమూరి తారక రామారావేనన్నారు. తెలుగు ప్రజల హృదయాలలో ఆరాధ్య దైవంగా నిలిచి, "అన్న అనే పదానికి శాశ్వత చిరునామాగా మారిన విశ్వ విఖ్యాత నటసార్వభౌమ పద్మశ్రీ డాఎం నందమూరి తారక రామా రావు జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

ఆశ్రమంలో రైస్ బ్యాగ్, కిరాణా సామాగ్రి అందజేత

నవ తెలంగాణ-సిద్దిపేట



వాసవి క్లబ్ వనిత, వాసవి క్లబ్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో జోన్ చైర్మన్ తోడుపునూరి రమేష్ కృష్ణవేణి పుట్టినరోజు సందర్భంగా నిరాశ్రయుల ఆశ్రమంలో రైస్ బ్యాగ్, కిరాణా సామాగ్రి, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ వనిత అధ్యక్షురాలు మరియాల వాణి, యూత్ క్లబ్ అధ్యక్షులు అరవపల్లి హరి కిరణ్, కోశాధికారి మాధవి తదితరులు పాల్గొన్నారు.

వీర సావర్కర్ ఆశయాలకనుగుణంగా మోడీ పాలన



నవ తెలంగాణ-సిద్దిపేట

వీర సావర్కర్ ఆశయాలకు అనుగుణంగా కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ పాలనను కొనసాగిస్తున్నారని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి అన్నారు. వీర సావర్కర్ 141 జయంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని సావర్కర్ విగ్రహానికి పూలమాలవేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రం, పునర్నిర్మాణం కోసం అనునిత్యం పరితపించిన మహానీయుడు వీర సావర్కర్ అని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో ప్రధాని మోడీ నడుస్తూ జనరంజక పాలన అందిస్తున్నారని కొనియాడారు. సావర్కర్ జీవితమే స్వాతంత్ర్య పోరాటమని, దేశం కోసం సింహభాగం ఆయన జైలులోనే గడిపారన్నారు. ఎందరో దేశభక్తులకు స్ఫూర్తిగా నిలిచి తన రచనలు, కవితలు, ప్రసంగాలతో దేశభక్తిని రగిలించిన గొప్ప వీరుడు సావర్కర్ అని కీర్తించారు. ఈ కార్యక్రమంలో సావర్కర్ సేవా సంస్థ సభ్యులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి చక్రధర్ గౌడ్ ఆర్థిక సహాయం

నవ తెలంగాణ - సిద్దిపేట



సిద్దిపేట పట్టణం నర్సా పురం గ్రామాని కి చెందిన మోతుక్కారి లింగ వ్వ అనారోగ్య కారణంతో మరణించగా ఫార్మర్ ఫ్రస్ట్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకు లు చక్రధర్ గౌడ్ రూ 10వేలు ఆర్థిక సహాయం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో అంత్రక్రియల కోసం సహాయం అందించినట్లు ఆయన తెలిపారు.

విష్ణి వంశీయుల రాజధాని నగరమే ఈ నంగునూరు

- పురావస్తు పరిశోధనల్లో దొరికిన ఆధారాలను బట్టి నంగునూరుకు 2000 సంవత్సరాల చరిత్ర
- చారిత్రక ఆధారాలు రక్షించి ముందు తరాలకు అందించడం మనందరి బాధ్యత
- కొలిపాక శ్రీనివాస్ చరిత్ర పరిశోధకుడు

నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా చేస్తున్న పురావస్తు పరిశోధనలో దొరికిన ఆధారాలను బట్టి గ్రామానికి 2000 సంవత్సరాల చరిత్ర ఉంది. వాటి మీద ఎన్నో దేవాలయ శిథిలాలు, విగ్రహాలు ఉన్నాయని కొన్ని భూమిలో కూరుకుపోగా మరికొన్ని పొలాల్లో దుండిన సమయాల్లో ధ్వంసం అవుతున్నాయని పురావస్తు శాఖ పరిశోధకుడు శ్రీనివాస్ తెలిపారు. గ్రామ గత చారిత్రక ఆధారాలు అయిన వాటిని రక్షించి ముందు తరాల వారికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గ్రామంలో అక్కడక్కడ పడి ఉన్న విగ్రహాలను ఒక చోటికి చేరిస్తే గ్రామ చరిత్రను ముందు తరాల వారికి అందించగలుగుతామన్నారు. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన గ్రామాలు నేడు కొన్ని అదృశ్యం అవ్వగా కొన్ని గత చారిత్రక వైభవాన్ని కోల్పోయి సాధారణ గ్రామాలుగా మిగిలి పోయాయి. అలాంటి ఒక గ్రామమే ఈ నంగునూరు. ఒకప్పుడు రాష్ట్రకూటులు, కల్యాణి చాళుక్యుల పరిపాలన కాలంలో వారి సామంతులుగా ఈ ప్రాంతాన్ని పాలించిన విష్టి వంశీయుల రాజధాని నగరం ఈ నంగునూరుగా పిలవబడే గ్రామం. 8 నుంచి 10 వ శతాబ్దం మధ్యలో ఈ గ్రామం ఒక పెద్ద జైన కేంద్రంగా ఉండేదని తెలుస్తోంది. ఇక్కడ లభించిన జైన విగ్రహాలు, శాసనాలు కూడా ఆ విషయాన్ని రుజువు చేస్తున్నాయి. ఇవేకాక పరిశీలనలో శాతవాహనుల, అంతకంటే ముందు నాటి అరుదైన వస్తువులు ఎన్నో ఇక్కడ దొరికాయి. ఈ గ్రామం పేరు వెనక అనేక కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది జోకిరమ్మ విగ్రహం కథ. ఈ విగ్రహం నగ్నంగా ఉండడం వల్ల గ్రామానికి నంగ, ఊరుక్మ నగనూరు, నంగనూరు, నంగునూరుగా మారిందని గ్రామస్థులు చెప్తారు.

తొలి చారిత్రాక యుగం ఆనవాళ్ళు

తెలంగాణలో ఇప్పటి వరకు ఎముకలు, మట్టి పడగం, లాజులే ఆగేట్, పచ్చ రంగురాళ్లతో చేసిన పూసలే దొరికాయి. కానీ మొట్ట మొదటిసారిగా నంగునూరులో గ్రానైట్ రాయితో చేసిన రాతిపూస లభ్యమైంది. ఇది క్రీస్తు శకం ప్రారంభానికి ముందరిదని పురావస్తు అధికారులు గుర్తించారు.

అతిపెద్ద జైన కేంద్రం

గ్రామంలోని ఎత్తైన పరుపూరాతి బండమీద ఉన్న విగ్రహాన్ని జోకిరమ్మ అని పిలుస్తున్నారు, కానీ ఇది 24 వ తీర్థంకరుడైన వర్ధమాన మహావీరునీ విగ్రహం దాదాపు పది అడుగుల ఎత్తు ఉన్న ఈ విగ్రహం జిల్లాలోనే అతిపెద్ద విగ్రహం



కావడం విశేషం. ఇదేకాక మైసమ్మ చెరువు కట్ట కింద మహావీరుని అధిష్టాన పీఠం, తలలేని విగ్రహం, ఆమ్రకుష్మండిని విగ్రహం పొలం దున్నే సమయంలో బయటపడ్డాయి. వాటిని పరిశీలించినప్పుడు అక్కడ ఒక జైన బసది ఉన్న ఆనవాళ్ళు లభించాయి. మరికొన్ని జైన విగ్రహాలు రామాలయం గోడల మీద పాత హనుమాన్ దేవాలయం దగ్గర ఉన్నాయి.

కొత్తరాతి యుగం ఆనవాళ్ళు

గ్రామంలోని జోకిరమ్మ బండ, రామాలయ గుడి బండలు మీద పూరమానవుడు తన ఆహార సేకరణలో బాగంగా ఉపయోగించిన రాతి గొడ్డళ్ల పదును పెట్టుకొన్నప్పుడు ఏర్పడిన గుంటలు(గ్రువ్స్)పదుల సంఖ్యలో ఉన్నాయి. 3 రాతి యుగం నాటి గొడ్డళ్ల కూడా దొరికాయి. వీటిని బట్టి పూర్వం మానవుడు ఇక్కడ నివసించేవాడని చెప్పవచ్చు.

పాటిమీద దొరికిన వస్త్వాదారాలు

ఎద్దుతల బొమ్మ



ఇక్కడ దొరికిన ఎద్దు బొమ్మ గ్రీకు శైలి ఎద్దుల బొమ్మలతో పోలికలు కలిగివుంది. బొద్దు కొమ్ములు, పెద్ద ముక్కు పుటాలు, బలమైన ముక్కు ఎముక, చక్కటికండ్లు. నిపుణుడైన శిల్పి చేతిలో పొడవు 10సెం.మీ., వెడల్పు 3.సెం.మీ., మందం 1 సెం.మీ., మూతి దగ్గర 3సెం.మీ. కొలతలతో చేయబడ్డ మట్టిబొమ్మ ఇది. క్రీ.పూ. వెయ్యి సంవత్సరాలప్పటిది, మూడువేల సం.రాల వయస్సు కలిగిఉంది,

టెర్రకోట పెండెంట్



ఈపెండెంట్ ఎర్రమట్టితో చేసింది. దీనికి పై భాగన దారంతో మెడలో కట్టుకోవడానికి రంధ్రం ఉంది. మెరిసే రంగురాయితో అలంకరించుకునేందుకు ఈ టెర్రకోట వస్తువుకు మధ్యలో గుంట వుంది. రోమన్ శైలి పెండెంట్లను గుర్తుచేసే విధంగా ఉంది,

శిథిల దేవాలయం

ఊరి చివర చెరువు దగ్గరగా ఒక దేవాలయం ఉన్నది. ఇక్కడ ఒక దేవాలయం ఉన్నట్టు చాలా మందికి తెలీదు, ఇది పూర్తిగా రాతికట్టడం, గుడిలో గర్భాలయం. అంతరాళం వున్నాయి. గర్భగుడి ద్వారం మీద వైష్ణవ ద్వారపాలకులు వున్నారు. గర్భగుడిలో ఏకదేవత(విష్ణు) రూపాలలో ఎవరి విగ్రహమో, ఏ శిల్పం లేదు అధిష్టానపీఠం వుంది. పీఠం మీద ఏ దేవతావాహనం లేదు. దేవాయలం గోడమీద బయటివైపు ఒకచోట జైన తీర్థంకరుని అర్థశిల్పం చిన్నది చెక్కివుంది.

పురాతన విగ్రహాలు:

భైరవుడు

వ్యవసాయ భూమిలో ఉన్న ఈ విగ్రహం చాళుక్య శైలిలో ఉన్న భైరవుడు, చతుర్భుడైన ఈభైరవుడు. ఖడ్గం, ఢమరుకం, త్రిశూలం, రక్తపాత్రలను ధరించాడు. దీర్ఘకర్ణాలు, జటామకుటం, దండకడియాలు, కంకణాలు, కాళ్ళకు కడియాలు, సర్పహారం, ఆభరణాలతో సర్వాంగ సుందరంగా ఉంది.

వినాయకుడు

గ్రామంలోని చౌడుచెరువు కట్టమీద ఉన్న వినాయక విగ్రహం కాకతీయుల అనంతర కాలనికి చెందినది. చతుర్భుజుడైన వినాయకుడు ఉదరం మీద నాగభందంతో లలితాసాసనంలో కూర్చోనిఉన్నాడు.

వీరగల్లులు

యుద్ధంలో మరణిం చిన వీరులను గ్రామ రక్షణ కొరకు, పులుల వంటి కరమైన జంతువుల తో పోరాడి, ప్రాణాలు పోగొట్టుకున్న వీరుల జ్ఞాపకంగా వేసిన శిలలే వీరగల్లులు. తర్వాత కాలా ల్లో వీరశైవం వ్యాపిస్తున్న కాలంలో వీరశైవులు శివసాయుజ్యం కోరి ఆత్మాహుతి చేసుకున్నవి కూడా వీరగల్లుగా పిలుస్తారు. నంగునూరు గ్రామంలో పదివరకు వీరగల్లులు ఉన్నాయి, వీటిలో కాకతీయులనాటి ఎక్కటి వీరగల్లులు, చాళుక్యుల నాటి రాజు ఆహార్యన్ని పోలిన వీరగల్లు, 17వ శతబ్దానికి చెందిన పోలి వీరగల్లులు ముఖ్యమైనవి.



మైనర్ డ్రైవింగ్ త్రిబుల్ రైడింగ్‌పై అవగాహన

- గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ మురళి

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

మైనర్ డ్రైవింగ్ త్రిబుల్ డ్రైవింగ్ చట్టరీత్య నేరమని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి అన్నారు మంగళవారం గజ్వేల్ మైనర్ డ్రైవింగ్ చేస్తున్న పిల్లలను పట్టుకొని వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం గజ్వేల్ ఇంద్రపార్క్ చౌరస్తా వద్ద మైనర్ డ్రైవింగ్, నెంబర్ ప్లేటు లేని వాహనాలపై, నెంబర్ ప్లేట్ సరిగా లేని వాహనాలపై త్రిబుల్ రైడింగ్‌పై వాహనదారులకు ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. మైనర్ పిల్లలు వాహనాలు నడపడం చట్టప్రకారం నేరమని తెలిపారు. ప్రతి వాహనదారుడు రవాణా శాఖ ఉత్తర్వుల మేరకు నెంబర్ ప్లేట్ వాహనాలకు బిగించుకోవాలన్నారు. తరచుగా నెంబరు ప్లేట్ లేని వాహనాల చోదకులు వేగంగా నడుపుతూ తోటి వాహదారులను, పాదాచారులను, భయభ్రాంతులకు గురిచేస్తున్నరని పేర్కొన్నారు. అలాంటి నంబరు ప్లేట్లులేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. మోటార్ సైకిల్ వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. నెంబర్ ప్లేట్ లేని వాహనదారులు అజాగ్రత్తగా, అతివేగంగా వాహనాలు నడుపుతునందున్న ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు.నెంబర్ ప్లేట్ నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మోటార్ సైకిల్‌పై ముగ్గురు ప్రయాణించ వద్దని, వాహనం నడిపే ప్రతి వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్స్ వెంబడి ఉంచుకోవాలని సూచించారు. త్రిబుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. మోటార్ సైకిల్ వాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని హెల్మెట్ బరువుగా కాకుండా బాధ్యతగా భావించాలన్నారు. హెల్మెట్ మా శాసనం కాదు మీ సంక్షేమం, హెల్మెట్ ఒక వస్తువు కాదు ప్రాణాన్ని కాపాడే ఆయుధమన్నారు. రోడ్ చిన్నదైనా పెద్దదైన, పడితే ప్రమాదమే ఆదమరిస్తే విషాదమవుతుందన్నారు. ఎక్కడైనా ఎప్పుడైనా చిన్నవారైన పెద్దవారైనా ప్రమాదం పొంచి ఉన్నదన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ప్రజలందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు నిబంధనలు ట్రాఫిక్



నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. నెంబర్ సరిగ్గా లేని వాహనాల పై కొంతమంది నేరస్తులు బండ్లపైన వచ్చి దొంగతనాలు చేయడం, చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తరచుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఏఈఓ సబిహా ఆధ్వర్యంలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తి సాగు సాంప్రదాయ పద్ధతిలో కాకుండా అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసినట్లయితే రైతులు ఎక్కువ దిగుబడి పొందవచ్చని సూచించారు. అధిక సాంద్రత ద్వారా సాగు చేసినట్లయితే మొక్క పొడవుగా పెరగకుండా 45, 65, 85 రోజులలో మెపి క్యాట్ క్లోరైడ్, అనే గ్రోత్ రెగ్యులేటర్ వాడడం వల్ల మొక్క పొడవుగా పెరగదు. దీనివల్ల ఆకు మందంగా పెరిగి రసం పీల్చు పురుగుల బెడద కూడా తక్కువ అవుతుంది. ఇక సాంప్రదాయ పద్ధతిలో పత్తిని సాగు చేస్తే నాలుగు నుంచి ఐదు సార్లు కలుపు తీయవలసి ఉంటుంది, అదే అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేస్తే రెండు నుంచి మూడుసార్లు మాత్రమే కలుపు తీయవచ్చు. కాబట్టి ప్రతి రైతు అధిక సాంద్రత పద్ధతిలోనే పత్తిని సాగు చేయాలన్నారు. అంతేకాకుండా విత్తనాలు కొనుగోలు విషయంలో కూడా జాగ్రత్తలు వహించాలని, లైసెన్స్ ఉన్న షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. కొనుగోలు చేసిన షాపు నుంచి తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని, ఆ రశీదును పంటకాలం అయిపోయే వరకు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

జీలుగా విత్తనాలు సరిపడా లేక రైతుల అవస్థలు

నవ తెలంగాణ-కొమురవెల్లి



మండలంలో జీలుగు విత్తనాలు సరిపడా లేక రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారని సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే జీలుగ విత్తనాలు రైతులకు సరిపడా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. జీలుగ విత్తనాలు అరకొరగా రావడంతో రైతులు తమకు అందుతాయో లేదో అని అయోమయ పరిస్థితిలో ఉన్నారని వెంటనే వ్యవసాయ అధికారులు స్పందించి పచ్చి రొట్ట విత్తనాలు సరఫరా చేయాలని లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు తాడూరి రవీందర్, అత్తిని శారద, మండల నాయకులు తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, ఉల్లంపల్లి సాయిలు, ఆరుట్ల రవి ఎల్లయ్య పాల్గొన్నారు

వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవ తెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని ఐడబ్ల్యూహెచ్ఎస్ ప్రభుత్వ వసతి గృహంలో (హాస్టల్) లో 3 నుంచి 10 తరగతి వరకు చదువుతున్న బాలురు చేరడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్లు సత్యనారాయణ, మల్లేశంలు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం 2024-25 నూతన విద్యా సంవత్సరానికి ఐడబ్ల్యూహెచ్ఎస్ వసతి గృహ అడ్మిషన్లు ప్రారంభిస్తున్నామని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు సంబంధించిన పేద పిల్లలు, ముఖ్యంగా హరిజన విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన ఉచిత వసతి గృహానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. నోట్ బుక్స్, పాఠశాల ద్వారా పాఠ్య పుస్తకములు, బెడ్ షీట్, కార్పెట్, మంచాలు, కంచాలు, కటోరాలు, నాలుగు జతల బట్టలు, ఉలెన్ రగ్గులు, స్వెటర్స్ మంకీ క్యాప్స్, ప్రతినెల కాస్మెటిక్ చార్జెస్, డైనింగ్ టేబుల్ భోజన వసతి, ప్రతి నెల వైద్యులచే ఆరోగ్య పరీక్షలు, స్కూల్ బ్యాగ్స్, స్పోర్ట్స్, నార్మల్ షఉ, పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ ఇవ్వబడునని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ట్యూటర్స్ చే ప్రత్యేక బోధనా చెప్పబడునని తెలిపారు. గత సంవత్సరము 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని, మినీ లైబ్రరీ సౌకర్యం ఉందని తెలిపారు. చక్కటి భోజనం ప్రభుత్వ మెనూ ప్రకారం అందించబడునని తెలిపారు. వివరాలకు సత్యనారాయణ 9441046917, మల్లేశం 9000019730 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బీమా జీవితానికి ధీమా

- ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్ గౌడ్

నవ తెలంగాణ-సిద్దిపేట



బీమా జీవితానికి ధీమా అని, గాయత్రి బ్యాంకు సిద్దిపేట శాఖలో ఖాతాదారుడు ఒగ్గరి మహేష్ ప్రమాదవశాత్తు మరణించగా, నిర్భయ సేవింగ్ ఖాతాపై గల ప్రమాదబీమా సౌకర్యం ద్వారా అతని భార్య ఒగ్గరి గిరిజకి లక్ష రూపాయల చెక్కును అందించినట్లు ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ గాదగోని చక్రధర్ గౌడ్, బ్రాంచి మేనేజర్ యస్.ప్రవీణ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం పట్టణ ప్రాంత ప్రజలకే కాకుండా గ్రామీణ ప్రాంత వినియోగదారుల ఆదారాభిమానాలు పొందుతూ, వారి అవసరాలకు అనుగుణంగా సేవలందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఖాతాదారులకు కనీస డిపాజిట్‌తోనే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తూ పేద మధ్య తరగతి వినియోగదారులకు ప్రమాద బీమాకల్పిస్తూవారికి అండగా ఉండటంపై హర్షం వ్యక్తం చేశారు. సేవింగ్ ఖాతాలు ప్రారంభించుటకు కావలసిన ఫోటో, జిరాక్స్‌లను బ్యాంకు యందే ఉచితంగా అందిస్తున్నామని, వ్యాపారస్తులకు వ్యాపార వృద్ధికై రుణాలను అందిస్తున్నామని, వినియోగదారులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఆఫీసర్ కిషోర్ పాల్గొన్నారు.

బ్రిలియంట్ హైస్కూల్ గుర్తింపును రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కొండం సంజీవ్ కుమార్

నవతెలంగాణ-సిద్దిపేట



ఎలాంటి నిబంధనలు పాటించకుండా, ఆట స్థలం లేకున్నా, ఫైర్ సర్టిఫికెట్ లేకున్నా, సెల్లార్‌లో నడిపిస్తున్న బ్రిలియంట్ హైస్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కొండం సంజీవ్ కుమార్ విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ, విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి, మధ్య తరగతి కుటుంబ పిల్లల్ని ఆసరా చేసుకుని స్కూలు నడిపిస్తున్న, ప్రభుత్వ నిబంధన తుంగలో తొక్కుతున్న విద్యాశాఖ చూసీ చూడనట్టు ఉంటుందన్నారు. నిబంధనలను పాటించని యాజమాన్యంపైన కఠిన చర్యలు తీసుకోవాలని, అడ్మిషన్స్ ఆపివేయాలని విద్యా శాఖ అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు క్రాంతి, రాజు, తరుణ్ పాల్గొన్నారు.